

ESTD : 1999

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

స్టేట్ విజన్

STATE VISION

గురువారం 30-07-2026 పేజీలు : 16


## నిఘా వ్యవస్థను పటిష్ఠ పరచాలి

- పోలీస్ కమీషనర్

ఫిర్యాదు వచ్చిన వెంటనే త్వరితగతిన స్పందించాలి

- ఇన్వెస్టిగేషన్ నందు నూతన టెక్నాలజీ పద్ధతులను ఉపయోగించాలి



15 పేజీలో...

## పరిశ్రమల్లో భద్రతే తొలి ప్రాధాన్యం..

ప్రమాదాల నివారణపై ప్రభుత్వం అత్యంత సీరియస్: మంత్రి వివేక్ వెంకటస్వామి

- రిస్కీ ఆపరేషన్లలో కాంట్రాక్ట్ కార్మికులతో పనులు చేయించొద్దు

- కంబస్టిబుల్ డస్ట్ ప్రమాదాల నివారణకు కఠిన మార్గదర్శకాలు రూపొందించాలని అధికారులకు ఆదేశం

హైదరాబాద్, జూలై 29: రాష్ట్రంలోని పరిశ్రమల్లో అత్యున్నత భద్రతా ప్రమాణాల అమలుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని శక్తి (కార్మిక, ఉపాధి, శిక్షణ ఱ ఫ్యాక్టరీస్) మరియు గనుల శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. పరిశ్రమల్లో ప్రమాదాలు పూర్తిగా నివారించాలంటే ప్రభుత్వం, యాజమాన్యాలు, కార్మికులు కలిసి బలమైన సేఫ్టీ కల్చర్‌ను నెలకొల్పాలని ఆయన పిలుపునిచ్చారు.

లక్డీకాపూల్‌లోని ఎఫ్‌టీసీసీఐలో నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల "ప్రాసెస్ సేఫ్టీ ఆఫ్ కంబస్టిబుల్ డస్ట్" జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను మంత్రి ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కంబస్టిబుల్ డస్ట్‌పై రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని ఆవిష్కరించారు.

మంత్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కంబస్టిబుల్ డస్ట్, గ్యాస్ లీకేజీలు




వంటి కారణాలతో పరిశ్రమల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమలకు ఇప్పటికే సమగ్ర భద్రతా నిబంధనలు ఉన్నప్పటికీ వాటి అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు.

15 పేజీలో...



## ఉగ్రరూపం దాల్చిన బొగత జలపాతం

వాజేడు,జూలై29(విజన్ ఆంధ్ర): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ములుగు జిల్లా, వాజేడు మండలం,చీకుపల్లి గ్రామంలో ఉన్నటువంటి తెలంగాణ నయాగారా బోగత జలపాతం ఉగ్రరూపం దాల్చింది. భారీ వర్షాల ప్రభావంతో ప్రసిద్ధి పర్యాటక ప్రాంతమైన బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తుంది. కొండల నుండి పడుతున్న నీరు పాల నురుగులా, పాలసంద్రంలా కనిపిస్తుంది. జలపాతానికి భారీగా వరద నీరు చేరడంతో ఉగ్రరూపంతో ప్రవహిస్తుంది. పర్యటకుల భద్రతలను దృష్టిలో ఉంచుకొని ఫారెస్ట్ అధికారులు బుధవారం తాత్కాలికంగా బొగత సందర్శనను నిలిపివేశారు. వరద నీరు తగ్గి, పరిస్థితులు సాధారణ స్థాయికి వచ్చే వరకు పర్యటకులు ఎవరు కూడా రావద్దని తెలిపారు

## వర్ష ప్రభావిత ప్రాంతాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ తనిఖీ

బెల్లంపల్లి, జూలై 29 విజన్ ఆంధ్ర : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి, , కమిషనర్ తన్నీరు రమేష్ పట్టణంలోని బజార్ ప్రాంతం, పలు బస్తీల్లో బుధవారం పర్యటించారు. వర్షాల కారణంగా ఇళ్లు కూలిన బాధితులను పరామర్శించి, నీరు నిలిచిన ప్రాంతాలు, డ్రైనేజీలు, నేలకూలిన భారీ వృక్షాలను పరిశీలించారు.

18 పేజీలో...




## రాకపోకలకు కొత్త దారి...

### రూ.62 లక్షలతో కల్వర్ట్ నిర్మాణం

- జగద్గిరిగుట్ట పైప్‌లైన్ రోడ్డులో పనుల పరిశీలన
- అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- "ప్రధాన రహదారులే ప్రాంత అభివృద్ధికి వెన్నెముక" అని ఎమ్మెల్యే వ్యాఖ్య
- ప్రజల సౌకర్యాలే లక్ష్యంగా మరిన్ని అభివృద్ధి పనులకు హామీ

కుత్బుల్లాపూర్, జూలై 29: (విజన్ ఆంధ్ర); కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 126వ డివిజన్ జగద్గిరిగుట్ట పైప్‌లైన్ రోడ్డులో రూ. 62 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నూతన కల్వర్ట్ పనులను బీఆర్ఎస్ శాసనసభాపక్ష విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ బుధవారం సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, నాణ్యతపై అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన, ఎలాంటి రాజీ లేకుండా పనులను నిర్ణీత

5 పేజీలో...

## మహిళా సంఘాల అభివృద్ధికి కార్యాచరణే బాట

- ఐదేళ్ల యాక్షన్ ప్లాన్ రూపకల్పనపై మహిళా సంఘాల ప్రతినిధులకు శిక్షణ
- మోడల్ క్లస్టర్ లెవల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం
- సభ్యుల కలలు, గ్రామ సంఘాల లక్ష్యాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి: ఏపీయం శకుంతల

పెద్ద శంకరంపేట్, జూలై 29: విజన్ ఆంధ్ర: మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసి, గ్రామాల అభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని పెంచే లక్ష్యంతో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మోడల్ క్లస్టర్ లెవల్ ఫెడరేషన్ (ఎంసీఎల్ఎఫ్) ఆధ్వర్యంలో వీఓఏలు, గ్రామ సంఘాల అధ్యక్షులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యుల వ్యక్తిగత కలలు, గ్రామ సంఘాల లక్ష్యాలను వచ్చే లిలిఐదేళ్ల వార్షిక కార్యాచరణ ప్రణాళిక (యాన్యువల్ యాక్షన్ ప్లాన్)లిలిలో పొందుపరిచి వాటిని కార్యరూపంలోకి తీసుకువచ్చే విధానంపై సవివరంగా అవగాహన కల్పించారు. గ్రామాభివృద్ధి, మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణకు కార్యాచరణ ప్రణాళిక కీలకమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శకుంతల, సీసీలు అబేద్, వీరచారి, స్వరూప, అనసూయ, అకౌంటెంట్ సాయిరెడ్డి, వీఓఏలు, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## అవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దు...

- నా ప్రియమైన హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు ముఖ్య విజ్ఞప్తి...



**నందవరంగ్రామ సర్పంచ్ శ్రీ లత బాలరాజ**

సిద్దిపేట జిల్లా : జూలై 29,(హుస్నాబాద్ నియోజకవర్గం / అక్కన్నపేట మండలం) : విజన్ ఆంధ్ర : ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలందరూ అప్రమంతంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీలత బాలరాజు విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... నీటితో నిండిన రోడ్లు, తెరిచి ఉన్న మ్యాన్ హోల్స్,విద్యుత్ తీగలు మరియు ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండండి,చిన్న పిల్లలు,వృద్ధులు మరియు అనారోగ్యంతో ఉన్నవారిపై ప్రత్యేక శ్రద్ధ వహించండి.మనందరం జాగ్రత్తగా ఉండి,ఒకరికి ఒకరు సహకరిస్తూ ఈ వర్షాల ప్రభావాన్ని సురక్షితంగా ఎదుర్కొవాలని ప్రతి ఒక్కరికి విజ్ఞప్తి చేశారు.

# పనులు ఎన్నో.. జీతాలు సున్నా..!

- మూడు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు
- బకాయి జీతాలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి



పెద్ద శంకరంపేట్, జూలై 29: విజన్ ఆంధ్ర : మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పెద్ద శంకరంపేట మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు. బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ బుధవారం ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం నిరసనగా నిర్వహించిన సమీక్ష సమావేశాన్ని బహిష్కరించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మాట్లాడుతూ.. వీబీజీ రాంజీ (జలసిరి) పనులు, ఇందిరమ్మ ఇళ్ల ఫోటో క్యాప్చర్, కార్మికుల హాజరు నమోదు, వనమహోత్సవ కార్యక్రమాలు తదితర అనేక ప్రభుత్వ బాధ్యతలను నిరంతరం నిర్వర్తిస్తున్నప్పటికీ, మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం వల్ల కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే గుర్తించి, పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని కోరారు. ఇకపై వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

## ఉట్నూర్ మండల స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జు

- ప్రజా ప్రతినిధులు, అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి వెడ్మ బొజ్జు పటేల్



ఉట్నూర్, జూలై 29, (విజన్ ఆంధ్ర) : ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, అధికారులు, ప్రజా ప్రతినిధులు. గ్రామాల్లోని సమస్యలు సర్పంచ్ లను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల నుండి హాజరైన అధికారులను, శాఖల వారీగా సమస్యలను తెలుసుకున్నారు. నర్సాపూర్ జె, వంకతుమ్మ, ఉట్నూర్, శ్యాంపూర్, చెరువుగూడ గ్రామాల్లో వర్ష కాలంలో ఏర్పడే విద్యుత్, రోడ్లు, వ్యవసాయం, వైద్యం, మంచి నీరు తదితర అంశాల పైన సుదీర్ఘంగా సమీక్ష జరిపి గ్రామాల్లో 100% జల సిరి ద్వారా ఇంకుడు గుంతలు నిర్మిస్తే ఎమ్మెల్యే నిధుల నుండి గ్రామ అభివృద్ధికి 5 లక్షల అదనంగా మంజూరు చేస్తాం అన్నారు. అధికారులు ఎప్పటికీ అప్పుడు సర్పంచ్ల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలి అన్నారు. అంగన్వాడీ నియామకాల్లో రూల్ పొసిషన్ పాటించాలని ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. ఉట్నూర్ టౌన్ రోడ్డు విస్తరణ, హ్యామ్ ద్వారా రోడ్ల విస్తరణ నిర్మాణం చేపడతాం అన్నారు. వర్ష కాలం దృశ్య వీధి దీపాలు, శానిటేషన్ పట్ల ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

# కొండగట్టు గిరిప్రదక్షిణలో పాల్గొన్న మంత్రులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, ఎస్పీ

- రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి.. వర్షాలు సమృద్ధిగా కురవాలి: హనుమంతుడిని వేడుకున్న మంత్రులు పొన్నం, అడ్లూరి



మల్యాల, జూలై 29(విజన్ ఆంధ్ర): గురు వ్యాస పౌర్ణమి సందర్భంగా జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలోలిలి నిర్వహించిన గిరిప్రదక్షిణలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పి అశోక్ కుమార్ పాల్గొన్నారు.

బుధవారం తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులతో కలిసి ప్రజాప్రతినిధులు గిరిప్రదక్షిణ పూర్తి చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాలు, శాంతి, సుభిక్షం కోసం ప్రార్థించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ , కొండగట్టు ఆంజనేయ స్వామి మహిమ అపారమని, ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణలో పాల్గొంటారని అన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు పండాలని, ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, గురు వ్యాస పౌర్ణమి సందర్భంగా కొండగట్టు గిరిప్రదక్షిణలో పాల్గొనడం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు కల్పించిందన్నారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణలోని అత్యంత పవిత్రమైన ఆంజనేయ క్షేత్రాల్లో కొండగట్టు ఒకటని అన్నారు. భక్తుల విశ్వాసానికి నిలయమైన ఈ క్షేత్రానికి ప్రభుత్వం అవసరమైన సౌకర్యాలను మరింత మెరుగుపరిచే దిశగా కృషి చేస్తోందన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ

ప్రకృతి అనుకూలించి రైతులు పంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వేలాదిగా భక్తులు పాల్గొనడం వారి అపారమైన భక్తికి నిదర్శనమన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ

గురు వ్యాస పౌర్ణమి గిరిప్రదక్షిణకు విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు. తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. వర్ష పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అధికారులు నిరంతరం అప్రమత్తంగా పనిచేశారని, భక్తులు సురక్షితంగా దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు కల్పించినట్లు వెల్లడించారు. భక్తుల సహకారంతో కార్యక్రమం విజయవంతంగా కొనసాగిందని తెలిపారు.

ఈ ప్రదక్షిణలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, స్థానిక ప్రజా ప్రతినిధులు, పూజారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శివంపేటలో ఓటర్ల నమోదు ప్రక్రియపై అవగాహన కార్యక్రమాలు

**- ప్రతి అర్హుడు ఓటరుగా నమోదు కావాలి: డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ బషీర్ హుస్సేన్**

మెదక్ , శివ్వంపేట, జూలై 28 (విజన్ ఆంధ్ర): శివంపేట మండల పరిధిలో ఓటర్ల నమోదు ప్రక్రియపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ బషీర్ హుస్సేన్ తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయడానికి చర్యలు చేపట్టామని చెప్పారు.
వచ్చే నెల 3వ తేదీతో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం ముగియనున్న నేపథ్యంలో, ఇంకా నమోదు చేసుకోని అర్హులైన యువత, మహిళలు వెంటనే తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే ఓటరు జాబితాలో పేర్లు, చిరునామా, ఇతర వివరాల్లో మార్పులు లేదా సవరణలు అవసరమైతే సంబంధిత అధికారులను సంప్రదించి సరిచేసుకోవాలని కోరారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ బషీర్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు.

# కుల్కచర్లను నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలి

కుల్కచర్ల, జులై, 29 (విజన్ ఆంధ్ర) : కుల్కచర్లను నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని భాజపా కేంద్ర టెలికం బోర్డు అడ్వైజరీ మెంబర్ వెంకటయ్య గౌడ్, కుల్కచర్ల సర్పంచి అంజిలయ్య, పీఏస్ పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన కుల్కచర్ల చౌరస్తాలో యువజన సంఘాల నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కుల్కచర్లను నియోజకవర్గంగా ఏర్పాటు చేయడానికి అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. జనాభా, గ్రామ పంచాయతీల పరంగా చూస్తే నియోజకవర్గంగా ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. నియోజకవర్గంగా ఏర్పాటు చేస్తే కుల్కచర్ల అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని తెలియజేశారు. ఇందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో దిశా కమిటీ సభ్యులు జానకీరాం, కుల్కచర్ల ఉప సర్పంచి విజయ్ కుమార్, నాయకులు హన్మంతు, మహిపాల్, రాంచెంద్రయ్య, గోపాల్ గౌడ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# విపత్తుల సమయాలలో సమర్థవంతంగా సేవలు అందించాలి

**- అదనపు కలెక్టర్ భుజంగరావు**

**- ఆపద మిత్ర' వాలంటీర్లకు కిట్లు పంపిణీ**



నిజామాబాద్, జూలై 29 : (విజన్ ఆంధ్ర )విపత్తులు సంభవించిన సమయాల్లో ఆపద మిత్ర వాలంటీర్లు తక్షణమే స్పందిస్తూ సహాయక చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ వి.భుజంగరావు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో బుధవారం ఆపద మిత్ర వాలంటీర్లకు కిట్లు పంపిణీ చేశారు. విపత్తుల సమయాలలో సహాయక చర్యలు చేపట్టేందుకు ఉపకరించే 14 రకాల వస్తువులతో కూడిన ఈ కిట్ ను ఎలా ఉపయోగించాలి అనే విషయాల గురించి ఎస్ డీ ఆర్ ఎఫ్ అధికారులు తెలియజేశారు. విపత్తులు సంభవించిన సమయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఆస్తి, ప్రాణ నష్టాన్ని ఎలా నివారించాలి, అత్యవసర సమయాలలో ప్రాథమిక చికిత్స పద్ధతులు, సీ.పీ.ఆర్ చేసే విధానం, తదితర అంశాల గురించి వివరించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్ భుజంగరావు మాట్లాడుతూ, విపత్తులను నిలువరించే శక్తి ఎవరికీ ఉండదని, అయితే ముందస్తు సన్నద్ధతతో ప్రాణ, ఆస్తి నష్టాల్ని చాలా వరకు నివారించవచ్చని అన్నారు. ఈ దిశగా క్షేత్రస్థాయిలో ఉండే ఆపద మిత్ర వాలంటీర్లు విపత్తుల సమయాలలో సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. ఇప్పటికే వాలంటీర్లకు ప్రకృతి వైపరీత్యాల సమయాలలో ఎలా వ్యవహరించాలి అనే అంశాలపై నిపుణుల ద్వారా శిక్షణ అందించామని గుర్తు చేశారు. నేర్చుకున్న అంశాలను విస్మరించకుండా ఆపద సమయాలలో ప్రజలకు సహాయకారులుగా నిలవాలని ఉద్బోధించారు. అదే సమయంలో స్వీయ రక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు.
జిల్లా రెవెన్యూ అధికారి గీత మాట్లాడుతూ, ఆపద సమయాలలో ప్రజలకు సహాయపడే అవకాశం లభించడాన్ని అదృష్టంగా భావించాలని అన్నారు. ఆపద మిత్ర నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి సాయన్న మాట్లాడుతూ, ఆపద మిత్ర వాలంటీర్లకు ప్రభుత్వం ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు గుర్తింపు కార్డులు, ఉపకరణాలతో కూడిన కిట్లు అందజేసిందని, బీమా సదుపాయం వర్తింపజేస్తుందని గుర్తు చేశారు. ఈ తోడ్పాటును సద్వినియోగం చేసుకుని సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ డీ-సెక్షన్ పర్యవేక్షకులు శ్రీనివాస్ రావు, ఆర్ఎస్ఐ శ్రీనివాస్, అగ్నిమాపక శాఖ, 7వ పోలీసు బెటాలియన్ అధికారులు, ఆపద మిత్ర వాలంటీర్లు పాల్గొన్నారు.

# రవికుమార్ మృతిపై న్యాయ విచారణ జరపాలి

**-జేఏసీ నాయకుల డిమాండ్**

బెల్లంపల్లి, జూలై 29 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి శాంతిఖని గనిలో అలర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న బి. రవికుమార్ మృతికి సింగరేణి యాజమాన్యం బాధ్యత వహించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం ఛాతినొప్పితో అస్వస్థతకు గురైన రవికుమార్‌ను బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించగా, ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు. అయితే అక్కడికి చేరుకునేలోపే రవికుమార్ మృతి చెందినట్లు పేర్కొన్నారు. బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రిలో కార్డియాలజిస్ట్ అందుబాటులో లేకపోవడం వల్లే ఈ ఘటన జరిగిందని జేఏసీ నాయకులు ఆరోపించారు. ఆస్పత్రిలో కార్డియాలజిస్ట్‌తో పాటు మహిళా వైద్యులను శాశ్వతంగా నియమించాలని కోరారు. ఈ ఘటనపై న్యాయ విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, రవికుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సూపరింటెండెంట్‌ను కలిసి వివరాలు తెలుసుకున్న జేఏసీ నాయకులు, మృతదేహాన్ని మంచిర్యాలకు తరలించడంపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పూర్తి స్థాయి విచారణ జరపాలని, డిమాండ్లు నెరవేర్చని పక్షంలో సింగరేణి ఆస్పత్రి ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి టి. మణిరామ్ సింగ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గజ్జి దుర్గయ్య, ఎస్‌జీకేఎస్ రాష్ట్ర నాయకుడు అంబాల మహేందర్ పేర్కొన్నారు.

# జాతీయ స్థాయి అంతరిక్ష కార్యశాలకు రాంపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని పి. శ్రీహిత ఎంపిక

**- విద్యార్థిని ప్రతిభను అభినందించిన ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి**

**- ప్రభుత్వ పాఠశాలలో చదివి జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణం**

**- ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందనడానికి ఇదే నిదర్శనమని ఎమ్మెల్యే స్పష్టీకరణ**

**- విద్యార్థిని సత్కరించి అభినందించిన ఎమ్మెల్యే**

డిచ్‌పల్లి మండలం రాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని పి. శ్రీహిత జాతీయ స్థాయి అంతరిక్ష కార్యశాలకు ఎంపిక కావడం నిజామాబాద్ జిల్లాకే గర్వకారణమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడం అభినందనీయమని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్య అందుతోందనడానికి శ్రీహిత ఎంపిక నిదర్శనమని ఆయన అన్నారు.
ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సదరు విద్యార్థిని ఎమ్మెల్యే శాలువతో సత్కరించి అభినందించారు. విద్యార్థిని ప్రోత్సహించిన స్థానిక ఎవీ గంగా సావిత్రి, ఉపాధ్యాయుడు శ్రీనివాస్ ఖత్రీలను సైతం ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..



2026 ఆగస్టులో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి అంతరిక్ష కార్యశాలలో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించేందుకు శ్రీహిత ఎంపిక కావడం రాష్ట్రానికే గర్వకారణమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.
ఇటీవల రాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విజయవంతంగా పూర్తి చేసిన శ్రీహితకు సైన్స్, టెక్నాలజీ అంశాలపై ప్రత్యేక ఆసక్తి ఉండటంతో పాటు సహపాఠ్య కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటూ ప్రతిభ కనబరుస్తోందని తెలిపారు.
ఈ సందర్భంగా విద్యార్థిని పి. శ్రీహితతో పాటు ఆమెను ప్రోత్సహించిన రాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగా సావిత్రి, మార్గదర్శక ఉపాధ్యాయులు శ్రీనివాస్ ఖత్రీలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించి జిల్లా, రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.
కాగా ప్రపంచవ్యాప్తంగా బాలికలను అంతరిక్ష విజ్ఞాన రంగంలో సాధికారులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో శక్తిశాట్ మిషన్ పనిచేస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా 108 దేశాలకు చెందిన 12 వేల మంది బాలికలను భాగస్వాములను చేయడంతో పాటు, ప్రతి దేశం నుంచి 108 మంది ప్రతిభావంతులైన విద్యార్థినులకు తమ ప్రతిభను చాటుకునే అవకాశాన్ని కల్పిస్తోంది.
అంతరిక్ష విజ్ఞానం, ఖగోళ శాస్త్రం, ఉపగ్రహ సాంకేతికతతో పాటు అంతరిక్ష రంగంలో జరుగుతున్న ఆధునిక పరిణామాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించే లక్ష్యంతో స్పేస్ కిడ్జ్ ఇండియా మరియు ఇస్రో భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ఈ జాతీయ స్థాయి కార్యశాలకు విద్యార్థిని ఎంపిక కావడం పట్ల జిల్లా వాసులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి పోలసాని శ్రీనివాస్, PACS చైర్మన్ రాంచందర్ గౌడ్ ఉన్నారు.

## గురు పౌర్ణమి వేళ కుడుగుంట దేవాలయం లో సాయిబాబాను దర్శించుకున్న తక్కలి శివ



మర్పల్లి, జూలై 29 (విజన్ ఆంధ్ర) మండలంలోని కుడుగుంట గ్రామంలో కొలువైన శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో బుధవారం గురు పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆరతులు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తక్కలి శివ వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురు పౌర్ణమి సందర్భంగా మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి శ్రీ సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సాయిబాబా ఆశీస్సులు పొందిన భక్తుల్లో కృష్ణ, గణేష్, శేఖర్, రమేష్, యాదవ్ రెడ్డి, శోభన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం చేశారు

## హెల్త్ కార్డులపై ఉద్యోగులకు కీలక సూచనలు

### రిటైర్డ్ ఒకేషనల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎడబోయినశ్రీనివాస్ రెడ్డి




అక్కన్నపేట, జూలై 29విజన్ ఆంధ్ర : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల హెల్త్ కార్డుల వినియోగంపై కీలక సూచనలు వెలువడ్డాయి. కొత్త హెల్త్ కార్డులకు సంబంధించిన ఉద్యోగుల పూర్తి వివరాలను ఆర్థిక శాఖ ఇప్పటివరకు ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ (జుఎజు)కు అందించకపోవడంతో ప్రస్తుతం పాత హెల్త్ కార్డులనే వినియోగించుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ఎంపిక చేసిన కొన్ని ఆసుపత్రుల్లో మాత్రమే హెల్త్ కార్డులపై నగదు రహిత (క్యాష్‌లెస్) వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లే ముందు 104 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి హెల్త్ కార్డు సేవలు అందిస్తున్న ఆసుపత్రుల వివరాలను తెలుసుకోవడం మంచిదని సూచించారు. హెల్త్ కార్డును అంగీకరించిన ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం ప్యాకేజీ రేట్ల ప్రకారం ప్రభుత్వం వైద్య బిల్లులను చెల్లించనున్నట్లు వెల్లడించారు.

## 90రోజుల పని దినాలను విధిగా సద్వినియోగం చేసుకోవాలి.. ఎంపిడివో వేణుగోపాల్ రెడ్డి..

మరిపెడ, విజన్ ఆంధ్ర : తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో అనుసంధానించినందున, లబిదారులందరు ఈ 90 రోజుల పని దినాలను వి



వేణుగోపాల్ మండలంలో నిర్మాణ పన వేణుగోపాల్ సీజనల్ వ్యా వర్షాలు కుర ప్రభలె అవ పాటించాలని అన్నారు,ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి అరుణ్ కుమార్ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# నామినేటెడ్ పదవుల పై చిగురిస్తున్న ఆశలు

### - కార్పొరేషన్ చైర్మన్ పదవులు వారికే నా!
### - ప్రయత్నాలు ముమ్మరం చేసిన ఆశవాహులు

నిజామాబాద్ జులై29:( విజన్ ఆంధ్ర) : అధికార కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల భర్తీపై నాయకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో సమావేశమైన తెలంగాణ పార్టీ నేతలు మంత్రివర్గ విస్తరణతో పాటు నామినేటెడ్ పదవుల పై నిర్ణయం తీసుకోనున్నారు. బుధవారం ఢిల్లీలో జరుగుతున్న సమావేశంలో పదవులపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే నామినేటెడ్ పదవులపై సీనియర్ కాంగ్రెస్ నాయకులతో పాటు కింది స్థాయి నాయకులు పదవుల కోసం ప్రయత్నాలను ముమ్మరం చేశారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లా నుండి నాలుగు కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఖాళీ అయిన విషయం విధితమే. అయితే వారికే పదవులు అప్పగిస్తారా లేక కొత్తవారికి అవకాశం ఇస్తారా అనేదానిపై పార్టీలో ఉత్కంఠత నెలకొంది. కామారెడ్డి జిల్లా నుండి కార్పొరేషన్ పదవిలో ఇప్పటివరకు కొనసాగిన కాసుల బాలరాజ్ తో పాటు, నిజామాబాద్ జిల్లా నుండి ఈరవత్రి అనిల్, మానాల మోహన్ రెడ్డి, అన్వేష్ రెడ్డిల పదవులు ఖాళీ అయిన విషయం తెలిసిందే. మరోసారి హై కమాండ్ తమకు అవకాశం కల్పిస్తుందని సదరు నాయకులు పూర్తి భరోసాతో ఉన్నారు. దీంతో పాటు తమకున్న పరిచయాలతో పైరవీలు సాగిస్తున్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా మహేష్ కుమార్ గౌడ్ నిజామాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తి కావడంతో ఆయన ద్వారా పదవుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మహేష్ కుమార్ గౌడ్ తో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సుల కోసం ప్రయత్నాలు సాగుతున్నాయి. నిరంతరం పార్టీ కోసం పని చేసే సీనియర్ నాయకులు ఈసారి తమకు ఎలాగైనా నామినేటెడ్ పదవులు, కార్పొరేషన్ చైర్మన్ పదవులు వస్తాయన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా నుండి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆకుల లలిత, అరికెల నర్సారెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్చార్జి వినయ్ కుమార్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జ్ సునీల్ రెడ్డి, ధర్మపురి సంజయ్,నరేందర్ రెడ్డి, నరాల రత్నాకర్ లు నామినేటెడ్ పదవుల కోసం ఆశిస్తున్నారు. బుధవారం ఢిల్లీలో జరుగుతున్న కీలక సమావేశంలో నామినేటెడ్ కార్పొరేషన్ చైర్మన్ ల పదవిపై కీలకమైన నిర్ణయం తీసుకోనున్నారు.

## ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ విజిట్ - ఫేజ్-||

### - టీపీటీఎఫ్ కరీంనగర్ జిల్లా మాజి ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి




అక్కన్నపేట్ జూలై 29విజన్ ఆంధ్ర : ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు ప్రపంచ స్థాయి విద్యా విధానాలను అధ్యయనం చేసే అవకాశంగా తెలంగాణ ప్రభుత్వం మరోసారి అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ ఌ ఎడ్యుకేషనల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ (ఫేజ్-××)ను నిర్వహించనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని 190 మంది ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను ఎంపిక చేసి ఐదు రోజుల పాటు విదేశీ విద్యా సంస్థలను సందర్శించే అవకాశం కల్పించనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపికైన బృందాలు ఫిన్లాండ్, సింగపూర్, జపాన్, వియత్నాం, చైనా దేశాలను సందర్శించి అక్కడి విద్యా విధానాలు, బోధనా పద్ధతులు, పాఠశాల నిర్వహణలో అమలవుతున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేయనున్నాయి. ఎంపిక ప్రక్రియను జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసే కమిటీ పర్యవేక్షిస్తుంది. అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ), జిల్లా కలెక్టర్ నామినేట్ చేసే ఒక అధికారి సభ్యులుగా ఉంటారు. జిల్లా స్థాయిలో ఎంపికైన జాబితాను రాష్ట్ర స్థాయి నిపుణుల కమిటీ తుది ఆమోదం తెలుపుతుంది.

SGT/LP/PET/TGT, SA/LFL HM/PGT, GHM/ప్రిన్సిపాల్ లేదా సమాన కేడర్‌లకు చెందిన వారు అర్హులు. 2026 ఆగస్టు 1 నాటికి 55 సంవత్సరాల లోపు వయస్సు, కనీసం 10 సంవత్సరాల ప్రభుత్వ సేవ, ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలలో కనీసం 100 మంది విద్యార్థుల నమోదు ఉండాలి. శాఖాపరమైన విచారణలు లేదా క్రిమినల్ కేసులు పెండింగ్‌లో లేకపోవడంతో పాటు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉండరాదు. విద్యార్థుల నమోదు పెంపు, అభ్యాస ఫలితాల మెరుగుదల, వినూత్న బోధనా విధానాలు, ఐసీటీ వినియోగం, పాఠశాల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యం, ఉపాధ్యాయ శిక్షణల్లో రిసోర్స్ పర్సన్‌గా సేవలు, పాఠ్యపుస్తకాలు లేదా ఈ-కంటెంట్ రూపకల్పన, జాతీయ లేదా రాష్ట్ర స్థాయి అవార్డులు, ఇంగ్లీష్ కమ్యూనికేషన్ నైపుణ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. గత మూడు సంవత్సరాల పనితీరును ఆధారంగా తీసుకుని అవసరమైతే ఇంటర్వ్యూ కూడా నిర్వహిస్తారు.

మొత్తం 190 మందిలో 64 మంది ప్రధానోపాధ్యాయులు/ప్రిన్సిపాళ్లు, 63 మంది SA/PGT/PSHలు, 63 మంది SGT/TGTలు ఎంపిక కానున్నారు. వీరిలో 76 మంది పురుషులు, 114 మంది మహిళలు ఉంటారు. అన్ని 33 జిల్లాలకు 4 నుంచి 8 మంది వరకు కోటా కేటాయించగా, మెదక్ జిల్లాకు 6 మంది కోటా కేటాయించారు.

ఎంపికలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు పురుష-మహిళా నిష్పత్తి, అన్ని మీడియం పాఠశాలలకు ప్రాతినిధ్యం ఉండేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది.

# డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 4న చలో బస్ భవన్

### - ఆర్టీసి విశ్రాంత ఉద్యోగుల సంఘం వెల్లడి

నిజామాబాద్, జూలై29:( విజన్ ఆంధ్ర) : ఆర్టీసీ సంస్థలో పనిచేసి పదవి విరమణ పొందిన ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 4వ తేదీన బస్ భవన్ ముట్టడి కేంద్రాన్ని చేపడుతున్నామని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనందం వెల్లడించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ సమస్యలు 2013 ఎంప్లాయిస్ పిఎఫ్ కంట్రిబ్యూషన్ ఇవ్వనందువలన పెన్షన్, 2017,2021 ఆర్ పి ఎస్ జీతం, డిఫరెన్స్ ఆఫ్ గ్రాడ్యుటి, డిఫరెన్స్ లీవ్ ఎన్ క్యాష్మెంట్ ఏరియర్స్ పెండింగ్లో ఉన్నాయని,తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని వాపోయారు. తెలంగాణ ఉద్యమ సాధనలో ఆర్టీసీ ఉద్యోగులు చురుకుగా పాల్గొన్నారన్నారు. ఆర్టీసీలో పింఛన్ రాక, ఆర్థిక ఇబ్బందులతో, అనారోగ్య సమస్యలతో దాదాపుగా 300 మంది చనిపోయారన్నారు. తాము బతుకున్నప్పుడే రావాల్సిన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఒక్కొక్కరికి పది నుండి పదిహేను లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉందన్నారు.ఆగస్టు మూడవ తేది వరకు తమ సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా 17వేల విశ్రాంత ఉద్యోగులు బస్ భవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షులు రాజన్న మాట్లాడుతూ మా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో ఎంపీలను ఎమ్మెల్యేలను కలిసి మెమోరండాలు ఇవ్వడం జరిగిందన్నారు. సంస్థలో పనిచేసి చనిపోయిన వారి కుటుంబాలకు అండగా నిలవాలని ప్రభుత్వాన్ని కోరూతున్నమ్మన్నారు. స్టేట్ జనరల్ సెక్రెటరీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, సంస్థలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన తర్వాత అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. వేతన సవరణ జరిగిన ఇప్పటివరకు డబ్బులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు పి రామచందర్, కార్యదర్శి ఎస్ పోశెట్టి, కోశాధికారి సుదర్శన్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ఎల్ నారాయణ, డి ఎస్ బి రాజు, జీవి చారి, ఆర్. నర్సింలు, జిల్లాలోని అన్ని డిపోల అధ్యక్షా కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి: ఏడబోయిన సుధాకర్ రెడ్డి

అక్కన్నపేట జూలై 29 విజన్ ఆంధ్ర : తెలంగాణ రాష్ట్రంలోని డిగ్రీ, జూనియర్ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఏడబోయిన సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని, ప్రస్తుత ప్రభుత్వం కూడా వాటి పరిష్కారంలో చొరవ చూపడం లేదని ఆయన విమర్శించారు. ఇప్పటివరకు విడుదలైన మూడు డీఏలు గత ప్రభుత్వ కాలానికి చెందినవేనని, ప్రస్తుతం మొత్తం ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. 2023 పీఆర్సీ అమలు, ప్రావిడెంట్ ఫండ్, ప్రభుత్వ బీమా, సరెండర్ లీవ్ బిల్లులు, రిటైర్మెంట్ బకాయిలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని అన్నారు. ఈహెచ్‌ఎస్ పేరుతో జీతాలు, పెన్షన్ల నుంచి 1.5 శాతం కోత విధిస్తున్నప్పటికీ ఉద్యోగులకు పూర్తిస్థాయి క్యాష్‌లెస్ వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం వెంటనే 2023 పీఆర్సీ అమలు, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏల విడుదల, హెల్త్ కార్డుల సమర్థవంతమైన అమలు, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు, రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఇతర ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

## శిథిల భవనంలో తహసీల్దార్ కార్యాలయం నిర్వహించడం సరికాదు

**- ..బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ జగన్‌మోహన్**

ముధోల్, జులై 29: విజన్ ఆంధ్ర : సుమారు 110 సంవత్సరాల నాటి శిథిలావస్థకు చేరుకున్న భవనంలో ముధోల్ తహసీల్దార్ కార్యాలయాన్ని నిర్వహించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని బీఎస్పీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ జగన్‌మోహన్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ రైతులు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో కార్యాలయానికి వస్తున్నారని ప్రమాదకర భవనంలో కార్యాలయం నిర్వహించడం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమేనని అన్నారు. ఉమ్మడి రాష్ట్రాల కాలం నుంచి ముథోల్ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిందని తెలంగాణ ఏర్పడి నిర్మల్ జిల్లా ఏర్పాటైనప్పటికీ తహసీల్దార్ కార్యాలయానికి నూతన భవనం నిర్మించకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. వెంటనే నూతన భవనాన్ని మంజూరు చేయాలని అప్పటి వరకు కార్యాలయాన్ని సురక్షితమైన ప్రత్యామ్నాయ భవనానికి తరలించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని శిథిల ప్రభుత్వ భవనాలపై ప్రత్యేక సర్వే నిర్వహించి నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే బీఎస్పీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముట్టడి, ధర్నాలు, ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు వాగ్మారే విలాస్, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీ యాదవ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాకటి నిఖిల్, దగ్దే అంబదాస్, సింగారే సునీల్, వాగ్మారే సుదర్శన్, దగ్దే కరణ్, తదితరులు పాల్గొన్నారు.




## గురు పౌర్ణమి సందర్భంగా ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**- ఉపాధ్యాయుల సేవలు సమాజానికి మార్గదర్శకం**

**- గ్రామ సర్పంచ్ చంటి గీతారమేష్**



చౌటకూర్, జూలై 29: సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో గురు పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉపాధ్యాయులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి వారి విశిష్ట సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చంటి గీతారమేష్ మాట్లాడుతూ, గురువు సమాజ నిర్మాణానికి మూలస్తంభమని అన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, విలువలతో కూడిన విద్యాభ్యాసం, దేశ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే, జీవితానికి దిశానిర్దేశం చేసేది గురువులేనని, వారి సేవలు ఎల్లప్పుడూ చిరస్మరణీయమని కొనియాడారు. గురు పౌర్ణమి సందర్భంగా ఉపాధ్యాయులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ వారి పట్ల గ్రామస్తులు కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థులు కూడా తమ గురువులను సన్మానించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేష్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి పావని, యూత్ కమిటీ సభ్యుడు మంగలి మహేష్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం గురు పౌర్ణమి స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగింది.

## రిటైర్డ్ ఉపాధ్యాయుడు అబ్దుల్ ఖాదర్ కు ఘన నివాళి..

**- సిపిఐ (ఎం) మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్**

మరిపెడ,విజన్ ఆంధ్ర : మహబూబాబాద్ జిల్లా మరిపెడ కేంద్రంలోని రిటైర్డ్ ఉపాధ్యాయుడు అబ్దుల్ ఖాదర్ కి వారి నివాసంలో సిపిఎం మండల ప్రతినిధి బృందం ఘన నివాళులు అర్పించడం జరిగిందని సిపిఐ ఎం మండల కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు, ఖాదర్ 2006న అబ్బాయిపాలెం ప్రాథమిక పాఠశాలలో, పదవి విరమణ పొందాలని అదేవిధంగా ఆయనకు ఇద్దరు కుమారులు, పెద్ద కుమారుడు అబ్దుల్ అజీజ్ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు, ప్రస్తుతం ఈయన దోర్నకల్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు, చిన్న కుమారుడు అబ్దుల్ రషీద్, భారత కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు,అదే విధంగా ఖాదర్ కి ఇద్దరు కుమారులు కూడా ఉన్నారు, ఖాదర్ ఉపాధ్యాయ వృత్తిలో అనేక మంది విద్యార్థిని, విద్యార్థులకు విద్యను బోధించి ఎంతో మందిని ప్రయోజకులుగా తీర్చిదిద్దారని కొనియాడారు, అతడు ఉపాధ్యాయుడుగా ఉన్నప్పుడు ఎంతో శ్రద్ధతో పాఠశాలకు వెళ్లేవారని అదేవిధంగా బాధ్యతతో ఉపాధ్యాయ వృత్తిని చేశారని గుర్తు చేశారు, అలాంటి వ్యక్తి ఈరోజు మనతో లేకపోవడం వారి కుటుంబానికే కాక సమాజానికి కూడా ఎంతో తీరని లోటు అని మధు వివరించారు ,ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు బాణాల రాజన్న, కందాల రమేష్, తాటికొండ అనంత చారి, మెట్రో ఈవినింగ్ పత్రిక విలేఖరి సత్తార్ పాషా ,వీరారం శాఖ సత్యం, దొంతు మమత తదితరులు పాల్గొన్నారు,

## గురుపౌర్ణిమ వేళ సాయినామ స్మరణతో మార్మోగిన మర్పల్లి షిరిడి సాయిబాబా ఆలయం

**- ప్రత్యేక పూజలు, అభిషేకాలు.. ఘనంగా అన్నదాన కార్యక్రమం**

**- సాయిబాబా సన్నిధిలో భక్తుల ఆధ్యాత్మిక సందడి**

మర్పల్లి, జూలై 29 (విజన్ ఆంధ్ర): మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం లో బుధవారం గురుపౌర్ణిమ పర్వదినం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించగా, ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి సాయిబాబా దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచే శ్రీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురుపౌర్ణిమ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల మధ్య సాయిబాబాకు పాలాభిషేకం, పంచామృతాభిషేకం, అర్చనలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం సాయిబాబాకు మహా మంగళహారతి సమర్పించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిపారవశ్యంలో ప్రార్థనలు చేశారు. ఆలియా ప్రాంగణంలో మహిళా భక్తులు కోలాటలాడుతూ నృత్యం చేస్తూ సాయిబాబాను స్మరించుకున్నారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తుల కోసం శ్రీ సాయి సేవా సమితి సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు క్రమపద్ధతిలో అన్నప్రసాదాన్ని స్వీకరించి సాయిబాబా ఆశీస్సులు పొందారు. గురుపౌర్ణిమ సందర్భంగా భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం రోజు పొడవునా సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి సేవా సమితి సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గురుపూజా మహోత్సవాన్ని విజయవంతం చేశారు. గురుపౌర్ణిమ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి.

## రాకపోకలకు కొత్త దారి...

గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రధాన రహదారులు ఏ ప్రాంత అభివృద్ధికైనా వెన్నెముకలాంటివని అన్నారు. మెరుగైన రవాణా వ్యవస్థ ఏర్పడితే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి ఊతమిస్తుందని పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి రహదారులు, కల్వర్టులు, డ్రైనేజీలు తదితర మౌలిక వసతులను అభివృద్ధి చేశామని తెలిపారు. రానున్న రోజుల్లో కూడా ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి నియోజకవర్గాన్ని మరింత ప్రగతిపథంలో నడిపిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ సంధ్య, ఏఈలు ఆశా, అభిరామ్, మాజీ కార్పొరేటర్ జగన్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, కిషోర్, నాయకులు బస్వరాజ్, మెట్ల శ్రీను, బ్రహ్మానంద చారి తదితరులు పాల్గొన్నారు.



## గురు పౌర్ణమి సందర్భంగా ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**- ఉపాధ్యాయుల సేవలు సమాజానికి మార్గదర్శకం**
**- గ్రామ సర్పంచ్ చంటి గీతారమేష్**

చౌటకూర్, జూలై 29 విజన్ ఆంధ్ర :- సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో గురు పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉపాధ్యాయులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి వారి విశిష్ట సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చంటి గీతారమేష్ మాట్లాడుతూ, గురువు సమాజ నిర్మాణానికి మూలస్తంభమని అన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, విలువలతో కూడిన విద్యాభ్యాసం, దేశ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే, జీవితానికి దిశానిర్దేశం చేసేది గురువులేనని, వారి సేవలు ఎల్లప్పుడూ చిరస్మరణీయమని కొనియాడారు. గురు పౌర్ణమి సందర్భంగా ఉపాధ్యాయులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ వారి పట్ల గ్రామస్తులు కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థులు కూడా తమ గురువులను సన్మానించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేష్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి పావని, యూత్ కమిటీ సభ్యుడు మంగలి మహేష్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి బూత్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**- బీజేవైఎం రాష్ట్ర నాయకులు డా. మల్గారి వైభవ్ రెడ్డి**
**- ప్రవాస్ యోజన కార్యక్రమంలో కార్యకర్తలకు దిశానిర్దేశం**

చేవెళ్ల, జులై 29 (విజన్ ఆంధ్ర) : ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రతి బూత్‌లో సమర్థవంతంగా అమలు చేసి, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని బీజేవైఎం రాష్ట్ర నాయకులు డా. మల్గారి వైభవ్ రెడ్డి సూచించారు. మంగళవారం చేవెళ్ల నియోజకవర్గంలోని శంకర్‌పల్లి మండలంలోని మహారాజ్‌పేట్, గోపులారం, ప్రొద్దుటూరు, జన్వాడ గ్రామాల బూత్‌లలో రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ప్రవాస్ యోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్ఏ బాల్‌రాజ్ నివాసంలో కార్యకర్తలతో కలిసి భోజనం చేసిన అనంతరం కార్యకర్తల ఇంట్లో రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా వైభవ్ రెడ్డి మాట్లాడుతూ... ఓటరు జాబితా పరిశీలనలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో పనిచేయాలని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బయాన, రఘుపతి, బాల్‌రాజ్, సింహం రాజు, బూత్ అధ్యక్షులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతానికి రాజకీయ పార్టీల సహకారం అవసరం

**– ఆర్‌డీవో కె. పార్థసింహారెడ్డి**



చేవెళ్ల, జూలై 29 (విజన్ ఆంధ్ర): ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్ణీత గడువులోగా విజయవంతంగా పూర్తి చేయడానికి రాజకీయ పార్టీలు, బీఎల్ఏలు పూర్తి సహకారం అందించాలని చేవెళ్ల ఆర్‌డీవో కె. పార్థసింహారెడ్డి కోరారు. చేవెళ్ల ఆర్‌డీవో, ఈఆర్‌వో కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో వారాంత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎస్ఐఆర్ ప్రక్రియలో చేపట్టాల్సిన చర్యలు, ఈఎఫ్ ఫారాల సేకరణ, ఓటర్ల వివరాల డిజిటలీకరణ పురోగతిపై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2,73,883 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,13,606 మంది వివరాల డిజిటలీకరణ పూర్తై 77.99 శాతం పురోగతి నమోదైనట్లు వెల్లడించారు. మండలాల వారీగా నవాబుపేటలో 81.06 శాతం, శంకర్‌పల్లిలో 81.18 శాతం, శంకర్‌పల్లి మున్సిపాలిటీలో 71.55 శాతం, మొయినాబాద్‌లో 79.63 శాతం, మొయినాబాద్ మున్సిపాలిటీలో 72.89 శాతం, షాబాద్‌లో 77.97 శాతం, చేవెళ్ల మండలంలో 81.40 శాతం, చేవెళ్ల మున్సిపాలిటీలో 73.36 శాతం డిజిటలీకరణ పూర్తైనట్లు తెలిపారు. ఇంకా 21,052 మంది ఓటర్ల వివరాల డిజిటలీకరణ పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. మిగిలిన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారని, ఓటర్ల వివరాల మ్యాపింగ్, డిజిటలీకరణ పనుల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి ఏజెంట్లు సమన్వయంతో సహకరించాలని ఆర్‌డీవో కె. పార్థసింహారెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతానికి రాజకీయ పార్టీల సహకారం అవసరం

**- కరస్పాండెంట్ శశిపాల్ రెడ్డి**
**- సంస్కృతి పాఠశాలలో గురుపౌర్ణిమ వేడుకలు**



చేవెళ్ల, జులై 29 (విజన్ ఆంధ్ర): గురువులను గౌరవించడం భారతీయ సంస్కృతిలో అత్యున్నత సంప్రదాయమని, జ్ఞానం, క్రమశిక్షణ, సంస్కారం, నైతిక విలువలను అందించి విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి మార్గనిర్దేశం చేసే మహోన్నత వ్యక్తి గురువేనని సంస్కృతి పాఠశాల కరస్పాండెంట్ అత్తెల్లి శశిపాల్ రెడ్డి అన్నారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు పామెనలోని సంస్కృతి పాఠశాలలో బుధవారం గురుపౌర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గురువులను పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి వారి ఆశీర్వాదాలు పొందగా, ఉపాధ్యాయులు గురుపౌర్ణిమ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా శశిపాల్ రెడ్డి మాట్లాడుతూ... గురువు కేవలం పాఠాలు బోధించే వ్యక్తి మాత్రమే కాదని, విద్యార్థుల జీవితాన్ని తీర్చిదిద్దే మార్గదర్శి అని అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు మంచి నడవడి, క్రమశిక్షణ, నైతిక విలువలను అలవర్చుకుని సమాజానికి ఆదర్శంగా ఎదగాలని సూచించారు. ప్రతి విద్యార్థిలో గురువుల పట్ల గౌరవం, కృతజ్ఞతాభావం ఉండాలని, గురువుల ఆశీస్సులతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రెహానా మాట్లాడుతూ, గురుపౌర్ణిమ వేడుకలు విద్యార్థుల్లో గురువుల పట్ల గౌరవ భావాన్ని పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని అన్నారు. గురువుల మార్గదర్శకత్వాన్ని అనుసరిస్తూ విద్యార్థులు విద్యా, నైతిక విలువల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సూపర్ ఎల్‌నినో ప్రభావానికి ముందస్తు చర్యలే రక్షణ

**- ఎంపీడీవో కే. శంకర్**
**ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి రైతు పంటకుంట ఏర్పాటు చేసుకోవాలి**



చౌటకూర్, జూలై 29 (విజన్ ఆంధ్ర ): సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలంలోని చౌటకూర్, వెంకట కృష్ణాపురం, తార్దన్ పల్లి , గ్రామపంచాయతీలో ప్రభుత్వ ఆదేశాల మేరకు జలసిరి ప్రత్యేక గ్రామసభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కే. శంకర్ ముఖ్య అతిథిగా హాజరై జల సంరక్షణ ప్రాధాన్యంపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల ఈ ఏడాది సూపర్ ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉందని, దాని కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే జూలై నెల ముగిసే దశలో ఉన్నప్పటికీ అనేక చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండలేదని, అందువల్ల ప్రతి నీటి బొట్టును సంరక్షించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. వర్షపు నీరు వృథాగా కాలువలు, వాగుల ద్వారా వెళ్లిపోకుండా భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూగర్భ జలాల పెంపుదలే జలసిరి కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ ప్రతి ఇంటి వద్ద తప్పనిసరిగా ఒక ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి రైతు తన వ్యవసాయ భూమిలో పంటకుంట నిర్మించుకోవాలని కోరారు. ఇళ్లలో వినియోగించిన నీరు, పైకప్పులపై నుంచి వచ్చే వర్షపు నీటిని ఇంకుడు గుంటల ద్వారా భూమిలోకి మళ్లిస్తే భూగర్భ జలాలు పెరిగి భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తగ్గడంతో పాటు వ్యవసాయానికి కూడా నీటి లభ్యత మెరుగుపడుతుందని తెలిపారు. జల సంరక్షణ కార్యక్రమాల్లో ప్రతి గ్రామస్తుడు భాగస్వామి కావాలని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ గ్రామసభలో గ్రామ సర్పంచ్ పార్కుల రామిరెడ్డి, సర్పంచ్ గణేష్, సర్పంచ్ పమేనోళ్ల అంజమ్మ ,పంచాయతీ కార్యదర్శి సిద్దమ్మ, కార్యదర్శి సందీప్ గౌడ్, ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, రైతులు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలి

**-కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

వాజేడు,జూలై29(విజన్ ఆంధ్ర): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖండే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు.బుధవారం వాజేడు మండలంలో పర్యటించారు.మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. చీకుపల్లి, పెద్ద గొల్లగూడెం ఇసుక వాగు వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. డైవర్షన్ రోడ్డు కాలువలు తవ్వి నీటిని మళ్ళిస్తున్నట్లు కలెక్టర్ కు అధికారులు తెలిపారు. వరద ప్రభావం తగ్గిన వెంటనే రోడ్డును వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ములుగు ఎస్పి సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో, వాజేడు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కొండా కృపాకర్ తదితరులు పాల్గొన్నారు

## పాంబండ సన్నిధిలో భక్తి శ్రద్ధలతో రుద్రహోమం

కుల్కచర్ల, జులై, 29 (విజన్ ఆంధ్ర): పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో భక్తి శ్రద్ధలతో రుద్రహోమం నిర్వహించినట్లు ఆలయ అర్చకులు పాండుశర్మ తెలిపారు. బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయం దగ్గర పౌర్ణమి సందర్భంగా రుద్రహోమం నిర్వహించారు. అర్చకులు మాట్లాడుతూ.... ప్రతి పౌర్ణమి రోజున ఆలయం దగ్గర ఉదయం రుద్రహోమం సాయంత్రం గిరి ప్రదక్షిణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దైవం వెలిసిన గిరి చుట్టూ ప్రదక్షిణలు చేయడం పుణ్య ఫలం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## పొట్లపల్లి రాజన్న ఆలయంలో ఘటాభిషేకములు వరుణ యాగం

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 29 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ, శ్రీ స్వయంభు రాజేశ్వర స్వామి దేవస్థానంలో కమిషనర్, దేవాదాయ శాఖ ,తెలంగాణ రాష్టం వారి ఆదేశానుసారం మన ప్రాంతము రాష్ట్రము దేశము పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అన్ని దేవాలయాలలో ఘటాభిషేకములు వరుణ యాగం నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం రోజున శ్రీ స్వయంభు రాజేశ్వర స్వామి దేవస్థానం, గ్రామం పొట్లపల్లి యందు శతాష్టోత్తర ఘటాభిషేకము మరియు వరుణ యాగం నిర్వహించడం జరిగినదని ఆలయ ఈవో పి కిషన్ రావు తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాచపల్లి శ్రీనివాస్, ఉప సర్పంచ్ చెప్పాల శ్రీధర్, వార్డు సభ్యులు ,అర్చకులు ఆలయ సిబ్బంది, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.



# కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**- సర్ ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకటేశం**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 29 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణ ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆర్డిఓ రామ్మూర్తిని కలిసి పట్టణంలో పోలింగ్ బూత్ ల సంఖ్య ప్రజలకు సౌకర్యానికి అనుగుణంగా పెంచాలని వినతిపత్రం పట్టణ బిజెపి నాయకులతో కలిసి బిజెపి సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి హుస్నాబాద్ పట్టణ ప్రవాస్ అభియాన్ సంయోజకులు ఖమ్మం వేంకటేశం ఆధ్వర్యంలో అందజేశారు.బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా సర్ ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 7 కార్యక్రమాలు పార్టీ నియమించిన సంయోజకులు ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం నుండి బుధవారం సాయంత్రం వరకు బిజెపి కార్యకర్తలతో బిఎల్ఎ 2 లతో కలిసి 8.పోలింగ్ బూత్ కమిటీల ఎనిమిది ప్రదేశాల్లో పర్యవేక్షణ సమావేశాలు నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ వారితో ముచ్చటించి, సర్ మరియు పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు.ఖమ్మం వేంకటేశం మాట్లాడుతూ బీజేపీకి బూత్ కమిటీలే బలమని ప్రతి బూత్ కమిటీ సభ్యుడు తన పరిధిలోని ప్రతి కుటుంబాన్ని కలుస్తూ కేంద్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు.ప్రజా ఉ ద్యమాలతో నిరంతరం పోరాడుతూ ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల విశ్వాసాన్ని పొందాలని కోరారు.ప్రతి బూత్ కమిటీ చురుకుగా పనిచేస్తూ యువత, మహిళలు, రైతులు, మేధావులు మరియు అన్ని వర్గాల ప్రజలను పార్టీతో అనుసంధానం చేయాలని పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అంకితభావంతో క్రమశిక్షణతో ఐకమత్యంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకురాలు లక్కిరెడ్డి తిరుమల, తోట స్వరూప,మాజీ కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్,పార్టీ నాయకులు తగురం లక్ష్మణ్, రాయికంటి చందు, తోట సమ్మయ్య, ఎర్రవెల్లి ప్రశాంత్,పెందోట భుశంకర చారి, ఇల్లందుల తిరుపతి, బొడిగె వెంకటేష్, ఎర్రోజు సాయికృష్ణ, నంద కుమార్, వరియోగుల మురళీధరస్వామి, విలసాగరం మురళీమోహన్, కౌన్సిలర్ అభ్యర్థులుగా పార్టీ తరుపున పోటీచేసిన అభ్యర్థులు బూత్ అధ్యక్షులు, బిఎల్ఎ 2లు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటకృష్ణపూరంలో వైభవంగా శ్రీ పాండురంగ స్వామి జాతర మహోత్సవాలు

చౌటకూరు, జూలై 29 (విజన్ ఆంధ్ర ):- చౌటకూర్ మండలం పరిధిలోని వెంకటకృష్ణపూరం గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ పాండురంగ స్వామి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. జాతర సందర్భంగా ఆలయం భక్తజనసందోహంతో కిక్కిరిసిపోయింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీ పాండురంగ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం బుధవారం తెల్లవారుజామున రథోత్సవాన్ని అత్యంత వైభవంగా చేపట్టారు. గ్రామ వీధుల గుండా సాగిన స్వామివారి ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు గోవింద నామస్మరణలు, భజన కీర్తనలతో రథోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.అలాగే గురు పౌర్ణిమను పురస్కరించుకుని భక్తులు తమ గురువులను దర్శించుకుని ఆశీస్సులు పొందారు. అనంతరం శ్రీ



పాండురంగ స్వామివారికి ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. ఏటా సాంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ జాతర మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధల నడుమ జరుగుతున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంటలే శాశ్వత పరిష్కారం

## జలసిరి, ఫామ్ పాండ్లు, వ్యక్తిగత సోక్ పిట్లపై రైతులకు అవగాహన

చౌటకూర్, జూలై 29 (విజన్ ఆంధ్ర ):- చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామంలో భూగర్భ జలాల సంరక్షణపై రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం మరియు రోజురోజుకూ తగ్గుతున్న వర్షపాతం నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రతి రైతు తమ పొలంలో ఇంకుడు గుంటలు, బోర్‌వెల్ రీచార్జ్ ఖండకాలు, జలసిరి మరియు ఫామ్ పాండ్‌లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి, ఎండిపోతున్న బోర్లు, బావుల్లో నీటి మట్టం గణనీయంగా మెరుగుపడుతుందని తెలిపారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ పనులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నీటి సంరక్షణ చర్యల వల్ల సాగునీటి ఎద్దడి తొలగి, పంటల దిగుబడి పెరిగి రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గీతా రమేష్, ఉప సర్పంచ్ మహేష్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి పావని, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వివిధ వార్డుల సభ్యులు, వ్యవసాయ అధికారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే పెద్దిని పరమర్శించిన కెప్టెన్ సాబ్, సతీష్ కుమార్

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 28 : సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో గుండె పోటుతో చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని బుధవారం రోజున మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మికాంతారావు, హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ పరామర్శించారు.ఆయనకు అందిస్తున్న వైద్యం గురించి, తెలుసుకొని ప్రస్తుత ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్న అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి భార్య, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం మాట్లాడుతూ దేవుడి ఆశీర్వాదంతో ప్రజానాయకుడు ప్రజల మనిషి అయిన పెద్ది సుదర్శన్ రెడ్డి క్షేమంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారి వెంట పలువురు బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.





# బెల్లంపల్లి సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా జాడి మహేశ్వర్

బెల్లంపల్లి, జూలై 29 విజన్ ఆంధ్ర బెల్లంపల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్ష ఎన్నిక బుధవారం ఉత్కంఠగా జరిగింది. మండలంలోని 17 గ్రామపంచాయతీల సర్పంచులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్ష పదవికి బుచ్చయ్యపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ జాడి మహేశ్వర్, గురజాల గ్రామ సర్పంచ్ వంగ రామన్న పోటీ చేశారు.

ఓట్ల లెక్కింపులో జాడి మహేశ్వర్‌కు 9 ఓట్లు, వంగ రామన్నకు 8 ఓట్లు లభించడంతో జాడి మహేశ్వర్ ఒక ఓటు మెజారిటీతో విజయం సాధించారు.

అనంతరం నూతన అధ్యక్షుడిని శాలువాతో సన్మానించారు.

ఈ సందర్భంగా ఆయన తన కార్యవర్గంలో . ఉపాధ్యక్షుడిగా జరుకుల సాయికిరణ్, జనరల్ సెక్రటరీలుగా సుధామల్ల వెంకటి, బొంతల అరుణ, కోశాధికారిగా జుమ్మిడి లలిత లను ప్రకటించారు..

## గురువు చూపిన మార్గంలో నడిచి సమాజానికి చేసే సేవే నిజమైన గురుదక్షిణ

**- కేశంపేట మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి.**

**- గురు పౌర్ణమి సందర్భంగా షాద్‌నగర్ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు**

నందిగామ:జులై 29(విజన్ ఆంధ్ర న్యూస్) ; గురువు చూపిన మార్గంలో నడిచి సమాజానికి చేసే సేవే నిజమైన గురుదక్షిణ అని కేశంపేట మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి అన్నారు.గురు పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం షాద్ నగర్ లోని షిర్డీ సాయిబాబా దేవాలయంలో కేశంపేట మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేదవ్యాస మహర్షి, గురుపరంపరను స్మరించుకుంటూ గురు పౌర్ణమి భారతీయ సంస్కృతిలో గురువుల పట్ల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేసే అత్యంత పవిత్రమైన పర్వదినమని అన్నారు.జ్ఞానాన్ని అందించి సమాజ నిర్మాణానికి దోహదపడే గురువుల సేవలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ తమ గురువులను గౌరవిస్తూ వారు చూపిన సన్మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.సద్గురు సాయిబాబా బోధించిన శ్రద్ధా,సబూరి సూత్రాలు ప్రతి ఒక్కరి జీవితానికి మార్గదర్శకాలని పేర్కొంటూ, ప్రేమ,సేవ,త్యాగం, మానవత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు.



# కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**- సర్ ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకటేశం**



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 29 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణ ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆర్డిఓ రామ్మూర్తిని కలిసి పట్టణంలో పోలింగ్ బూత్ ల సంఖ్య ప్రజలకు సౌకర్యానికి అనుగుణంగా పెంచాలని వినతిపత్రం పట్టణ బిజెపి నాయకులతో కలిసి బిజెపి సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి హుస్నాబాద్ పట్టణ ప్రవాస్ అభియాన్ సంయోజకులు ఖమ్మం వేంకటేశం ఆధ్వర్యంలో అందజేశారు.బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా సర్ ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 7 కార్యక్రమాలు పార్టీ నియమించిన సంయోజకులు ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం నుండి బుధవారం సాయంత్రం వరకు బిజెపి కార్యకర్తలతో బిఎల్ఎ 2 లతో కలిసి 8.పోలింగ్ బూత్ కమిటీల ఎనిమిది ప్రదేశాల్లో పర్యవేక్షణ సమావేశాలు నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ వారితో ముచ్చటించి, సర్ మరియు పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు.ఖమ్మం వేంకటేశం మాట్లాడుతూ బీజేపీకి బూత్ కమిటీలే బలమని ప్రతి బూత్ కమిటీ సభ్యుడు తన పరిధిలోని ప్రతి కుటుంబాన్ని కలుస్తూ కేంద్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు.ప్రజా ఉద్యమాలతో నిరంతరం పోరాడుతూ ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల విశ్వాసాన్ని పొందాలని కోరారు.ప్రతి బూత్ కమిటీ చురుకుగా పనిచేస్తూ యువత, మహిళలు, రైతులు, మేధావులు మరియు అన్ని వర్గాల ప్రజలను పార్టీతో అనుసంధానం చేయాలని పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అంకితభావంతో క్రమశిక్షణతో ఐకమత్యంతో పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకురాలు లక్కిరెడ్డి తిరుమల, తోట స్వరూప,మాజీ కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్,పార్టీ నాయకులు తగురం లక్ష్మణ్, రాయికంటి చందు, తోట సమ్మయ్య, ఎర్రవెల్లి ప్రశాంత్,పెందోట భుశంకర చారి, ఇల్లందుల తిరుపతి, బొడిగే వెంకటేష్, ఎర్రోజు సాయికృష్ణ, నంద కుమార్, వరియోగుల మురళీధరస్వామి, విలసాగరం మురళీమోహన్, కౌన్సిలర్ అభ్యర్థులుగా పార్టీ తరుపున పోటీచేసిన అభ్యర్థులు బూత్ అధ్యక్షులు, బిఎల్ఎ 2లు తదితరులు పాల్గొన్నారు.

# బొమ్మరెడ్డిగూడెంలో సంత్ శ్రీ రామ్‌రావ్ మహారాజ్ 91వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

చౌటకూర్ జూలై 29 (విజన్ ఆంధ్ర ):- బంజారా గిరిజనుల ఆరాధ్య దైవం, బాల బ్రహ్మచారి శ్రీ శ్రీ శ్రీ సంత్ తపస్వి రామ్‌రావ్ మహారాజ్ 91వ జయంతి వేడుకలు చౌటకూర్ మండలం పరిధిలోని బొమ్మరెడ్డిగూడెంలోని భవానీ సేవాభాయ్ (సేవాలాల్) ఆలయ ప్రాంగణంలో బుధవారం నాడు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బంజారా సంప్రదాయబద్ధంగా 'భోగ్ భండార్' కార్యక్రమాన్ని నిర్వహించి, స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ వేడుకల సందర్భంగా గ్రామంలోని భక్తులకు, ప్రజలకు భారీగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

**విద్యార్థులకు ఫలాల పంపిణీ:** జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పండ్లు (అరటిపండ్లు) పంపిణీ చేశారు. సంత్ రామ్‌రావ్ మహారాజ్ సమాజానికి చేసిన సేవలు, చూపిన భక్తి మార్గాన్ని ఈ సందర్భంగా పలువురు నాయకులు స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు, గ్రామ సర్పంచ్ జైపాల్ నాయక్, ఉప



సర్పంచ్ రజిని గోపాల్, ఆత్మ కమిటీ డైరెక్టర్ రాములు, వార్డు సభ్యులు గోపాల్, మేనక గణేష్, నాయకులు శంకర్ నాయక్, రవీందర్ నాయక్, రఘు నాయక్, దేవిదాస్, హెడ్ మాస్టర్, మెదక్ ఎక్సైజ్ డీటీఎఫ్ సీఐ గోపాల్, ఖోలా విట్టల్, బాల్ సింగ్, సురేందర్, రంగారావు, జైల్ సింగ్, పాండు, రమేష్, ఉమ్లా, రెడ్డి, రవీందర్, శ్రీనివాస్, తిలక్, సురేష్, మీట్యా, వసంత్, ప్రకాష్, పాండ్యా, విగ్యా, ప్రవీణ్, అకేష్, అవినాష్‌లతో పాటు గ్రామ పురోహితులు, ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# జలసిరితో జలభద్రతకు బాటలు..

## వెల్ జర్ల లో జల సిరి భాగస్వామ్యానికి ఆర్పి బాబు నాయక్ పిలుపు

షాద్‌నగర్, విజన్ ఆంధ్ర జూలై 29 : భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించాలంటే ప్రతి నీటి చుక్కను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వెల్జర్ల గ్రామ సర్పంచ్ రాత్లవత్ బాబు నాయక్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం వెల్జర్ల గ్రామంలో బుధవారం నిర్వహించిన 'జలసిరి' గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామ అభివృద్ధితో పాటు జల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

గ్రామంలో ఇంటింటికీ ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ సోక్‌పిట్స్, రైతులకు పంట కుంటలు, ఊట కుంటలు, బోర్‌వెల్ రీఛార్జ్ వ్యవస్థలను ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలను పెంచవచ్చని తెలిపారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించుకోవాలని, ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లభించే అవకాశముందని చెప్పారు.

రైతులు తక్కువ నీటితో అధిక దిగుబడి వచ్చే పంటలను సాగు చేయాలని సూచించిన ఆయన, ప్రతి పొలంలో ఫాంపాండ్, ప్రతి ఇంటి వద్ద సోక్‌పిట్ ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. జల



సంరక్షణలో ప్రజల భాగస్వామ్యమే గ్రామాభివృద్ధికి బలమని పేర్కొన్నారు. ఈ గ్రామసభలో ఉపసర్పంచ్ దొడాల వెంకటేష్ యాదవ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి బాల మల్లేష్, జీపీఓ విష్ణు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, ప్రభుత్వ అధికారులు, రైతులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# జై బాలాజీ రాంలాల్ స్వీట్ షాప్ ప్రారంభోత్సవం

**- ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,**

నందిగామ:జులై 29(విజన్ ఆంధ్ర న్యూస్) ; నందిగామ మండలం చేగూర్ గ్రామంలో అరవింద్ ఏర్పాటు చేసిన జై బాలాజీ రాంలాల్ స్వీట్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షాప్ నిర్వాహకుడు అరవింద్‌కు శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,వ్యాపారం అభివృద్ధి చెందుతూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఏసిఎస్ చైర్మన్ మామిళ విట్టల్, బుగ్గొనిగూడ మాజీ సర్పంచ్ రాజు,వార్డు సభ్యులు బీఆర్ఎస్ నాయకులు,బంటారాం మల్లేష్ గౌడ్,శివ చారి, తుక్కుగూడ రవి,గుండాల శ్రీను,నర్సిమ,శ్రీశైలం, రవి,మహేందర్, జగన్, సుధాకర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# చేగూర్‌లో భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

**- సాయిబాబా సేవలో మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్.**

నందిగామ:జులై 29(విజన్ ఆంధ్ర న్యూస్) : నందిగామ మండల పరిధిలోని చేగూర్ సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి సందర్భంగా చేగూర్ మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంకాల శ్రీశైలం, సర్పంచ్ సాలయ్య,ఉప సర్పంచ్ ఆవుల శివశంకర్,వార్డు సభ్యులు భాస్కర్ గౌడ్, గునుగుర్తి రాజశేఖర్,సోలిపేట శ్రీనివాస్,పబ్బే ప్రవీణ్,ఎండీ ఖలీద్ ,మాజీ వార్డు సభ్యులు పబ్బే శ్రీశైలం,గిరి గౌడ్,లెంకపోతుల రవి గౌడ్,కాంగ్రేస్ పార్టీ సీనియర్ నాయకులు పసుల బుచయ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు పబ్బే సుధాకర్, మండల యూత్ కాంగ్రేస్ అధ్యక్షులు వెంకట్ చారి,ఉపాధ్యక్షులు మంగలి మహేష్,గ్రామ పెద్దలు లక్ష్మయ్య,రాజు గౌడ్,యువకులు పబ్బే నరేందర్,ఎర్రోళ్ల ప్రవీణ్,నర్సింగ్,కిరణ్,శివ మహిళలు యువకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వానొస్తే.. ఇంట్లోకే వర్షపు నీరు

వాజేడు,జులై29(విజన్ ఆంధ్ర): కురుస్తున్న భారీ వర్షాలకు వాజేడు నాగారం మాజీ సర్పంచ్ బోదేబోయిన కృష్ణ ఇంట్లోకి బుధవారం భారీగా వర్షం నీరు చేరింది. ఇల్లు పూర్తిగా జలమయంగా మారింది. ఇంట్లోని సామాగ్రి పూర్తిగా తడిసి ముద్దయినట్లు తెలిపారు. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కనీస డ్రైనేజీ సౌకర్యం లేకపోవడం వల్లనే ప్రతిసారి మాకు ఇదే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ ఇంటికి రక్షణ కరువైతే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. చెరుకూరు గ్రామంలో..

గొంది ప్రసాద్ ఇంట్లోకి బుధవారం వరద నీరు చేరి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సమస్య సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోలేదని ఆరోపించారు. పాలకులు, అధికారులు స్పందించి డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కోరారు.



# 39 లక్షలతో ఇంద్రవెల్లి కేజీబివీ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే బొజ్జు

**- రాష్ట్రంలో విద్య వ్యవస్థ బలోపేతానికి ముఖ్యమంత్రి కృషి వెడ్మ బొజ్జు పటేల్**



ఇంద్రవెల్లి, జులై 29, (విజన్ ఆంధ్ర) : ఇంద్రవెల్లి మండలంలోని కేజీబీవి పాఠశాలలో 39 లక్షల రూపాయలతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ చేసిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో విద్య వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోంది అని, విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని గుర్తించి, ఉన్నత చదువులు చదువుతూ గొప్ప స్థాయికి చేరుకోవాలని, ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక బోధన అందిస్తూ, సమాజంలో జరుగుతున్న కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులతో కాంట్రాక్టర్ త్వరతిగతిన నాణ్యతతో పనులు పూర్తి చేయాలనీ సూచించారు. పాఠశాల సిబ్బంది పనుల నాణ్యతను నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ పెంచేలా చర్యలు తీసుకోవాలి

**- త్రాగునీటి సమస్య, అరుతడి పంటలపై రైతాంగానికి అవగాహన కల్పించాలి**

**- బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 29 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల అభివృద్ధి సమీక్షా నిర్వహించారు.ఈ సమావేశానికి సమావేశంలో బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితి అందరం సమష్టిగా ఎదుర్కోవాలని,తాగునీటి సమస్య ,వ్యవసాయానికి ఆరుతడి పంటలపై రైతాంగానికి అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ ఇబ్బందులు లేకుండా చూసుకోవడం, రవాణా,పంచాయతీరాజ్ ,విద్యపై అంశాలు చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కింద జిరంజి కింద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.బోర్ వెల్ రీఛార్జి ఫిట్స్ ఈజీఎస్ కింద తీసుకోవాలని, వ్యవసాయ పొలాలకు రెండున్నర ఎకరాలు పైగా ఉన్న ఉన్న వారికి 2.5 లక్షలతో బావి తవ్వుకునే అవకాశం ఉందన్నారు. ఆయిల్ ఫాం సాగు పెంచేలా చర్యలు తీసుకోవడం ,విత్తనాలు సబ్సిడీ ఎరువుల పై చర్చ జరపాలన్నారు.సర్పంచ్ లుగా గ్రామ ప్రజా ప్రతి నిధులుగా పెండింగ్ పనులు పూర్తి చేయాలని,గ్రామాల్లో సాంక్షన్ అయిన పనులు వెంటనే పూర్తి చేయాలని,ఇంకుడు గుంతలు నిర్మించడంలో ముందుండే గ్రామాల అభివృద్ధిలో ముందుంటానన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్ కట్టుకోవచ్చని,పాఠశాలలో సమస్యలు లేకుండా పరిష్కారం చేసుకుందామన్నారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని,పక్కనే నర్మేట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఉందని, ఆయిల్ ఫామ్ సాగు గ్రామాల్లో పెంచాలన్నారు.ప్రతి గ్రామాల్లో జల శక్తి సంరక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అంశాలు పరిష్కారం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఎంసి చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆత్మ చైర్మన్ జంగపల్లి ఐలయ్య అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

**- బీఎల్‌వోలు నమోదు చేసిన వివరాలను ఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు క్రాస్ వెరిఫై చేయాలి**

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి**



నిజామాబాద్, జూలై 29 : (విజన్ ఆంధ్ర )ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు మరికొద్ది రోజులే మిగిలి ఉన్నందున ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, బీఎల్‌వోలు నమోదు చేసిన వివరాల్లో ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి సూచించారు.

బుధవారం హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో సీ.ఈ.ఓ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు తుది గడువు సమీపించినందున ఓటర్ల నుంచి సేకరించిన అన్ని ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. బీఎల్‌వోలు వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసే సమయంలో చేసిన పొరపాట్ల కారణంగా అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వాటికి ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. బీఎల్‌వోలు నమోదు చేసిన ప్రతి వివరాన్ని ఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు తప్పనిసరిగా క్రాస్ వెరిఫై చేయాలని, ఏవైనా లోపాలు ఉంటే రెండు రోజుల్లో వాటిని సరిదిద్దాలని ఆదేశించారు. అనంతరం కూడా తప్పిదాలు గుర్తిస్తే సంబంధిత బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లపై చర్యలు తీసుకుంటామని సీఈఓ స్పష్టం చేశారు.

పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియ ఇంకా పెండింగ్‌లో ఉందని, సూపర్‌వైజర్లు బీఎల్‌వోలతో సమన్వయం చేసుకుని వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 100 శాతం డిజిటలైజేషన్ పూర్తికాగా, 80 నియోజకవర్గాల్లో 90 శాతానికి పైగా డిజిటలైజేషన్ పూర్తైనట్లు తెలిపారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) ప్రక్రియను కూడా సమాంతరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని, ఈ విషయంలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఖండించాలని జిల్లా ఎన్నికల అధికారులకు సూచించారు. అన్ని స్థాయిలలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ పురోగతి గురించి వివరించాలని, పోలింగ్ స్టేషన్‌ల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను బూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్‌ఏలు) అందజేసి వారి సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయలక్ష్మి, రవీందర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# మల్లూర్ లో భారీ వర్షం ..

### జనజీవనం అస్తవ్యస్తం

**పొంగిపొర్లుతున్న ఆరెవాగు, మానేరు..**

**- విద్యుత్ స్తంభంపై కూలిన చెట్టు.. త్రుటిలో తప్పిన ముప్పు**

మల్హర్, జూలై 29 విజన్ ఆంధ్ర : మండలంలో మంగళవారం అర్ధరాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షాలకు జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. మండల వ్యాప్తంగా తాడిచర్ల, కొయ్యూరు, వల్లెంకుంట, రుద్రారం, పెద్దతూండ్ల, మల్లారం తదితర గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. నిరంతర వానలతో మండల పరిధిలోని ఆరెవాగు, తీగలవాగు, బొగ్గులవాగు, మానేరు నది వరద నీటితో ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్నాయి.

రవాణా, విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

భారీ వరద ఉధృతికి మండల కేంద్రమైన తాడిచర్ల ఓసిపి కన్వేయర్ రహదారి పూర్తిగా తెగిపోయింది. దీంతో ఆ మార్గంలో రవాణా సౌకర్యం పూర్తిగా నిలిచిపోయింది. తాడిచర్ల గ్రామంలోని మేనంపల్లిలో ఒక భారీ చింతచెట్టు ఈదురు గాలికి విరిగి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభంపై కూలిపోయింది. విద్యుత్ స్తంభం పూర్తిగా విరిగిపడినప్పటికీ, త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో తాడిచర్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచి పోయింది.

ఎల్నినో కరువు తీరింది... రైతన్నల్లో ఆనందం:

గత కొన్ని రోజులుగా ఎల్నినో ప్రభావం వల్ల వర్షాలు కురవక తీవ్ర కరవు పరిస్థితులు నెలకొన్నాయి. ఎండిపోతున్న పంటలకు ఈ వర్షం ప్రాణపోతగా మారింది. కరవు కాలంలో కురిసిన ఈ భారీ వర్షం రైతులకు తీవ్ర ఊరట కలిగించడంతో రైతులు సాగు పనుల్లో నిమగ్నం కానున్నారు. ఈ వర్షం వల్ల చెరువులు, కుంటలు జలమయం కావడంతో మండల వ్యాప్తంగా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## తాడిచర్లలో స్తంభించిన బొగ్గు ఉత్పత్తి పనులు!

మల్హర్, జూలై 29 విజన్ ఆంధ్ర : గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మల్హర్ రావు మండల కేంద్రమైన తాడిచర్ల జెన్కో ఓపెన్ కాస్ట్-1 గనిలో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. మైన్ పరిధిలోకి భారీగా వర్షపు నీరు వచ్చి చేరడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ వర్షాల వల్ల దాదాపు 18 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తితో పాటు, 2 లక్షల 40 వేల క్యూబిక్ మీటర్ల ఓబీ (ఓవర్ బర్డెన్) తొలగింపు పనులకు ఆటంకం కలిగిందని కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, కేవిఎస్ఎన్ మూర్తి మరియు మైన్ మేనేజర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం గనిలో చేరిన నీటిని భారీ మోటార్ల ద్వారా బయటకు పంపుతున్నామని, వర్షం తగ్గిన వెంటనే పనులను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామని వారు పేర్కొన్నారు.

## గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల గడువు పొడిగింపు

### జూలై 31 వరకు అవకాశం..

బెల్లంపల్లి, జూలై 29 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి పొలిటికల్ సైన్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీకి దరఖాస్తుల గడువును జూలై 31 సాయంత్రం 4 గంటల వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ముసురు వర్షాల కారణంగా అభ్యర్థుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ బి.ఏ. ఆనర్స్, పీజీ ఎం.ఏ. పొలిటికల్ సైన్స్ ఇంగ్లీష్ మీడియం తరగతులకు బోధించేందుకు ఇంగ్లీష్ మీడియం బ్యాక్‌గ్రౌండ్ కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉంటే అర్హత కల్పిస్తామని వివరించారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హతలు కలిగిన వారికి తొలి ప్రాధాన్యం ఉంటుందని, కంప్యూటర్ పరిజ్ఞానం కూడా తప్పనిసరి అని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ, డెమోలను మంచిర్యాలలోని ప్రభుత్వ ఐడీ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూ తేదీలను సంబంధిత అభ్యర్థులకు ప్రత్యేకంగా తెలియజేస్తామని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరిన ప్రిన్సిపాల్, మరిన్ని వివరాలకు 9959269975 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# అంక్షాపూర్ అంగన్‌వాడీలో అవకతవకల ఆరోపణలు...

**- అధికారుల విచారణ**

**- అంగన్వాడీ టీచర్ కు మెమో జారీ**



నంగునూరు మండలం జూలై 29 విజన్ ఆంధ్ర : సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అంక్షాపూర్ గ్రామ అంగన్ వాడీ కేంద్రంలో అవకతవకలు జరిగాయని చేసిన ఫిర్యాదుపై జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు నిర్వహించిన ఈ విచారణలో లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అంగన్ వాడీ టీచర్ వాంగ్మూలాలను నమోదు చేశారు. విచారణలో వెలుగు చూసిన అంశాల ఆధారంగా సంబంధిత అధికారులకు నివేదిక సమర్పిస్తామని అధికారులు తెలిపారు. అంక్షాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మాయోజు పద్మ--బుచ్చి వీరయ్య అధ్యక్షతన నిర్వహించిన విచారణకు జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఇంఛార్జి అధికారి (డీడబ్ల్యూఓ) సీహెచ్. శారద హాజరయ్యారు. గ్రామ ప్రజలు, అంగన్ వాడీ లబ్ధిదారులు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధిత అంగన్ వాడీ టీచర్ వివరణను స్వీకరించారు. ఈ సందర్భంగా డీడబ్ల్యూఓ ఇన్‌చార్జి శారద మాట్లాడుతూ, విచారణలో గుర్తించిన అంశాలపై సంబంధిత అంగన్ వాడీ సిబ్బందికి మెమో జారీ చేస్తామన్నారు. పూర్తి విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపించి తదుపరి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారమే అంగన్ వాడీ కేంద్రాలు నిర్వహించాలని చెప్పారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందాల్సిన పోషకాహారం, సంక్షేమ సేవలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘనలు పునరావృతం అయితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విచారణ సందర్భంగా గ్రామ ప్రజలు, లబ్ధిదారులు తమ సమస్యలు, అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. వాటిని నమోదు చేసి పరిశీలిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

# ప్రతి ఒక్కరి ఓటు నమోదు అయ్యే విధంగా కృషి చేయాలి...

## ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి..



బోధన్,జూలై 29(విజన్ ఆంధ్ర) : కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు అయ్యేలా కృషి చేయాలని ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి బిఎల్ఏ లకు సూచించారు. బుధవారం బోధన్ పట్టణంలోని లయన్స్ ఆడిటోరియం భవనంలో పీసీసీ డెలిగేట్ గంగా శంకర్ అధ్యక్షతన బిఎల్ఏలు,పార్టీ కౌన్సిలర్లతో ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సర్ జిల్లా కో ఆర్డినేటర్ శేఖర్ గౌడ్ తో కలిసి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. మండలాల వారీగా ఎస్ఐఆర్ నమోదు పురోగతిని సమీక్షించి, ఇంకా నమోదు చేసుకోని అర్హుల వివరాలను గుర్తించి వారి ఓటు నమోదు చేయించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నమోదు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో, పట్టణంలోని వార్డులలో ఇంటింటికి తిరిగి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పెండింగ్లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యతగా పరిష్కరించి, ప్రతిరోజూ నమోదు పురోగతిపై సూపర్ వైజర్ లు సమీక్ష నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా సర్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసిన బిఎల్ఏ లకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నగేష్ రెడ్డి, మాజీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, పట్టణ, మండలాల అధ్యక్షులు దాము, నాగేశ్వర్ రావు, పులి శ్రీనివాస్, సీనియర్ నాయకులు పాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ శంకర్, పార్టీ కౌన్సిలర్లు, సర్పంచ్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరిశుభ్రమైన పరిసరాలే వ్యాధుల నివారణకు మార్గం

**- డాక్టర్ ధనరాజ్, వైద్య ఆరోగ్య అధికారి, సిద్దిపేట జిల్లా**

**- రాజగోపాలపేట పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో**

**నంగునూరు మండలం**



జూలై 29 విజన్ ఆంధ్ర : వర్షాలు రైతులకు ఆశలు నింపినా, ఆరోగ్య శాఖకు మాత్రం అప్రమత్తతను పెంచుతాయి. గ్రామాల్లో ఎక్కడైనా నిల్వ నీరు కనిపిస్తే డెంగీ, మలేరియా వంటి వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉంటుంది. ప్రజల ఆరోగ్య భద్రత కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.హెచ్. ధనరాజ్ స్వయంగా క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఆరోగ్య కేంద్రాల పనితీరును పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం రాజగోపాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సేవల అమలు, టీకాల కార్యక్రమం, మందుల నిల్వలను పరిశీలించారు. వర్షాకాలంలో ఒక్క చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారి తీస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం 'డ్రై డే' నిర్వహించడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చని తెలిపారు. అలాగే, వర్షాల కారణంగా రవాణా ఇబ్బందులు ఎదురయ్యే గ్రామాల్లో గర్భిణులకు ముందస్తు వైద్య సహాయం అందేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.

"ప్రజల ఆరోగ్యమే ప్రాధాన్యం" అనే సందేశంతో వైద్యశాఖ పనిచేస్తోందని పేర్కొన్న డీఎంహెచ్‌వో, ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందాలని చెప్పారు. వైద్య సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యానికి తావులేదని హెచ్చరించారు. ఆరోగ్య వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు.



## రోటరీ క్లబ్ ఆఫ్ బోధన్ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ...

బోధన్, జులై 29(విజన్ ఆంధ్ర) : రోటరీ క్లబ్ ఆఫ్ బోధన్ ఆధ్వర్యంలో బుధవారం బోధన్ పట్టణంలోని మహాలక్ష్మి కళ్యాణ మండపంలో బోధన్ డివిజన్ లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 325మంది విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి విచ్చేసి విద్యార్థినులకు సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులో ఉన్నతంగా రాణించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను అందించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రొటేరియన్ అక్స్. ఉదయ్ పిలానీ, రోటరీ క్లబ్ ఆఫ్ బోధన్ అధ్యక్షులు శ్రీనివాస్ రాజు, కార్యదర్శి అల్లే రమేష్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ కేంద్రం వద్ద బారులు

### ....కేవైసి తంటాలు

ముధోల్:29జూలై:విజన్ ఆంధ్ర : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి కేవైసీ తప్పనిసరిగా చేయడంతో గ్రామాల్లో పలు లబ్ధిదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలకు ఆధార్ అప్డేట్ లేకపోవడంతో రేషన్ దుకాణాల్లో ఈపాస్ లో వారి వేలిముద్రలు నవోదు కావడం లేదు. దీంతో ఆధార్ అప్డేట్ కోసం తల్లిదండ్రులు,పిల్లలతో మండల కేంద్రమైన ముధోల్ లోనితహసిల్దార్ కార్యాలయ ఆధార్ కేంద్రం వద్ద వేకువ జామున క్యూలైన్ లో వేచి ఉన్నారు. మరోపక్క ఈనెల 31వ తేదీ లోపు కేవైసీ చేసుకోవాలని ప్రభుత్వం గడువు విధించింది. దీంతో తల్లిదండ్రులు,పిల్లలతో ఆధార్ అప్డేట్ కోసం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయ ఆధార్ కేంద్రం వద్ద బారులు తీరారు.

# గురువు స్థానం దైవంతో సమానం

**- పాద పూజ చేసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ...**



నిజామాబాద్ జులై29:(విజన్ ఆంధ్ర )భారతీయ సాంప్రదాయంలో గురువు స్థానం దైవంతో సమానమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. గురు పూర్ణిమను పురస్కరించుకొని బుధవారం నగరంలోని బింగి కళ్యాణ మండపంలో గురువు కోన సముందర్ శ్రీనాథ్ శర్మ దంపతులకు కుటుంబసమేతంగా పాద పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గురువులు జీవితంలోని అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞాన వెలుగును ప్రసాదిస్తారని పేర్కొన్నారు. వీర సంవత్సరాలుగా భారతదేశంలో కొనసాగుతున్న గురు శిష్య సంప్రదాయానికి ఈరోజు ప్రతీకగా నిలుస్తుంది అన్నారు. అనేకమంది సన్యాసులు యోగులు ఈ రోజున కొత్త దీక్షలో జపాలు సాధనలు ప్రారంభిస్తారని తెలిపారు. గురువే బ్రహ్మ గురువే విష్ణువు గురువే మహేశ్వరుడు. గురువే పరబ్రహ్మ స్వరూపుడన్నారు. గురువులకు పాదపూజ చేయడం, తోచిన దక్షిణ, వస్త్రాలు, పండ్లు, పుస్తకాలు, సమర్పించడం ఆనవాయితీ అన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే గురువు జీవితానికి అర్థాన్ని నేర్పుతారని అన్నారు. జ్ఞానం వినయం సంస్కారం ధర్మం విలువలను గుర్తు చేసే పవిత్ర పర్వదినం అని వివరించారు. అంతకుముందు మల్లారంలోని దత్త ఆశ్రమాన్ని దర్శించుకున్నారు.

# ప్రజా వైద్యాన్ని బలోపేతం చేయాలి..

**- కార్పొరేట్ వైద్య దోపిడీకి అడ్డుకట్ట వేయాలి**

**- ఆగస్టు 2 జిల్లా సదస్సును విజయవంతం చేయాలని సీపీఎం పిలుపు**



కుత్బుల్లాపూర్, జూలై 29 (విజన్ ఆంధ్ర); ప్రజా వైద్యాన్ని బలోపేతం చేసి ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు కార్పొరేట్ వైద్య దోపిడీకి అడ్డుకట్ట వేయాలని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆగస్టు 2న నిర్వహించనున్న జిల్లా సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం ఉదయం షాపూర్నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత అయినప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వాలు వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులను ప్రోత్సహించే విధానాలను అమలు చేస్తున్నాయని విమర్శించారు. దీంతో సాధారణ జ్వరం, జలుబు వంటి వ్యాధుల చికిత్సకే వేల రూపాయలు, శస్త్రచికిత్సలకు లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ భారాన్ని భరించలేక లక్షలాది కుటుంబాలు అప్పుల పాలవుతుండగా, కొందరు సరైన చికిత్స అందక ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కుత్బుల్లాపూర్ ప్రాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సీపీఎం బృందం సందర్శించి రోగులతో మాట్లాడిన సందర్భంగా అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. జనాభాకు అనుగుణంగా వైద్యులు లేకపోవడం, మందుల కొరత, అవసరమైన వైద్య పరికరాల లేమి, మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉందన్నారు. కొన్ని ప్రభుత్వ ఆస్పత్రుల ప్రాంగణాలు వాహనాల పార్కింగ్ కేంద్రాలు, చెత్త డంపింగ్ యార్డులుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్య వ్యవస్థను నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టాలని, ప్రభుత్వ వైద్యాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కీలుకాని లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంజయ్య, శీను, సంతోష్, దుర్గానాయక్, ఖలీల్, షఫీ, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# 'మన ఊరు - మన బడి' పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి..

**-ప్రభుత్వ బడుల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయం**

**-ప్రభుత్వాలు మారినా.. గత ప్రభుత్వ అభివృద్ధి పనులు ఆగకూడదు**

**-మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**

నిజామాబాద్ జులై 29 (విజన్ ఆంధ్ర ) విద్యార్థుల భవిష్యత్తు, విద్యాభివృద్ధికి సంబంధించిన విషయాల్లో ప్రభుత్వాలు మారినా గత ప్రభుత్వం చేపట్టిన మంచి పనులను కొనసాగించాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందని బాల్కొండ శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. ముచ్కూర్, భీంగల్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం దాత దయానంద్ రెడ్డి అందించిన సుమారు 2 లక్షల విలువైన 50 డ్యూయల్ డెస్క్ బెంచీలను(ముచ్కూర్ 25,భీంగల్ 25) గురువారం ఆయన స్థానిక నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. గురువుల ఆశీస్సులతోనే జ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలలో చదివి, కష్టపడి వ్యాపార రంగంలో ఉన్నత స్థాయికి చేరుకున్న దయానంద్ రెడ్డి లాంటి వ్యక్తులు నేటి విద్యార్థులకు ఆదర్శమని కొనియాడారు. ప్రతి సంవత్సరం తన సంపాదనలో 5 నుంచి 10 శాతం వరకు సమాజ సేవకు కేటాయిస్తూ విద్యాసంస్థలకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. విద్యార్థులు కూడా బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకుని భవిష్యత్తులో తమ గ్రామాలకు, పాఠశాలలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.విద్యార్థుల భవిష్యత్తు, విద్యాభివృద్ధికి సంబంధించిన అంశాల్లో రాజకీయాలు చేయడం తగదని స్పష్టం చేసిన ఎమ్మెల్యే, ప్రభుత్వాలు మారినా గత ప్రభుత్వం చేపట్టిన మంచి కార్యక్రమాలను కొనసాగించడం పాలకుల బాధ్యత అని పేర్కొన్నారు.గత కేసీఆర్ ప్రభుత్వంలో 'మన ఊరు--మన బడి' కార్యక్రమం కింద నియోజకవర్గం లో అనేక పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని గుర్తు చేశారు. ముచ్కూర్లో కాంట్రాక్టర్లు సొంత నిధులతో శ్లాబ్ పనులు పూర్తి చేసి సుమారు రూ.30 లక్షల బిల్లులు పెండింగ్లో ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు చెల్లించలేదని విమర్శించారు. పెండింగ్ బిల్లుల కారణంగానే రాష్ట్రవ్యాప్తంగా అనేక పాఠశాలల అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయాన్ని తాను ఆర్థిక మంత్రికి వివరించడంతో పాటు అసెంబ్లీలో మాజీ మంత్రి హరీష్ రావుతో కలిసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో కూడా ఈ అంశాన్ని బలంగా లేవనెత్తుతానని స్పష్టం చేశారు. స్థానిక అధికార పార్టీ నాయకులు కూడా రాజకీయాలు పక్కనపెట్టి పెండింగ్ బిల్లులు విడుదలయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

ఇటీవల ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు నేలపై కూర్చుని చదువుతున్న దుస్థితిని చూసి దయానంద్ రెడ్డి సహకారంతో 40 డ్యూయల్ డెస్క్ బెంచీలను అందించామని, పలు పాఠశాలలకు సైన్స్ కిట్లు కూడా అందించినట్లు గుర్తు చేశారు. ముచ్కూర్ లో పాఠశాలకు సైన్స్ కిట్ అవసరమని ఉపాధ్యాయులు కోరగా, దయానంద్ రెడ్డితో మాట్లాడి అందించే ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే అన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే తన రాజకీయ లక్ష్యమని పేద విద్యార్థులకు అండగా సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, స్వచ్ఛందంగా ముందుకు వచ్చే దాతలను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నర్సయ్య, మాజీ జడ్పీటీసీ రవి, మాజీ ఎంపిపి మహేష్, కౌన్సిలర్లు నీలం రవి, భగత్, నర్సాయ్య, మల్లెల ప్రసాద్, ముచ్కూర్ గ్రామ సర్పంచ్, మండల విద్యాధికారి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



### ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి

**- ఏడిఏ మంజుల,ఏవో తనూజరాజ్**

చారకొండ, జూలై 29 (విజన్ ఆంధ్ర) : ఎల్-నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని ఏడిఏ మంజుల సూచించారు. ఈ మేరకు మండలంలోని మర్రిపల్లిలో బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తనూజరాజ్ మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ కాలంలో దిగుబడి ఇచ్చే పంటల సాగుతో పాటు పంటల వైవిధ్యీకరణ (క్రాప్ డైవర్సిఫికేషన్)ను రైతులు అవలంబించాలని సూచించారు. అలాగే నాణ్యమైన విత్తనాలు, ఎరువుల వినియోగం,ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు వివరించారు. అనంతరం రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చి, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## పులుల పరిరక్షణతోనే ప్రకృతి సమతుల్యత సాధ్యం




**- ఎఫ్ఆర్వో పర్వేజ్ అహ్మద్**

గద్వాల జూలై 29 (విజన్ ఆంధ్ర) ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో గద్వాల పట్టణంలో స్థానిక ప్రాథమిక అభ్యాస పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి, పులుల సంరక్షణ,జీవవైవిధ్య పరిరక్షణ,అడవుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో పర్వేజ్ అహ్మద్ మాట్లాడుతూ,

పులులు ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని,వాటి సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. అడవులు, వన్యప్రాణులను పరిరక్షించేందుకు చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందని సూచించారు. అనంతరం విద్యార్థులు పులుల సంరక్షణ,అడవుల పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. వ్యాసరచన,చిత్రలేఖన పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పులుల పరిరక్షణపై తమ ఆలోచనలను వ్యాసాలు,చిత్రాల రూపంలో సృజనాత్మకంగా ఆవిష్కరించారు.ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేసి అభినందించారు.

ఈ కార్యక్రమంలో రేంజ్ సిబ్బంది,పాఠశాల సిబ్బంది విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయాలి

## BJYM నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు ధన్నోజు నరేష్ చారి.

బిజినపల్లి రిపోర్టర్ (విజన్ ఆంధ్ర) జూలై 29 బుధవారం : ఈరోజు నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలంలోని పాలెం గ్రామంలో బిజెపి యువమోర్చా (బీజేవీ) జిల్లా అధ్యక్షులు ధన్నోజు నరేష్ చారి ఆధ్వర్యంలో ఫీజుల బకాయి - బిజెపి లడాయి ఉద్యమంలో భాగంగా ధన్నోజు నరేష్ చారి మాట్లాడుతూ...విద్యార్థులకు రావలసిన ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయాలని భారతీయ జనతా పార్టీ, భారతీయ యువమోర్చా రాష్ట్ర పార్టీ పిలుపులో భాగంగా ఫీజు రియంబర్స్మెంట్ రావాల్సిన రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల మంది విద్యార్థులతో సంతకాల సేకరణలో భాగంగా ఈరోజు పాలెం గ్రామం శ్రీ వెంకటేశ్వర జూనియర్ అండ్ డిగ్రీ కాలేజ్ ఆర్ట్స్ ఉ సైన్స్( సుబ్బయ్య కళాశాల ), నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం స్ఫూర్తి కాలేజ్ , పద్మావతి కాలేజ్, రవితేజ కాలేజ్, ఉర్దూ కాలేజ్, గీతాంజలి , ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రావలసిన బకాయిల గురించి విద్యార్థులకు తెలియజేస్తూ, విద్యార్థులకు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక విద్యార్థికి ఎంత బకాయి ఉందో వారి చేతనే రాయిస్తూ, సంతకాల సేకరణ చేయడం జరిగిందని, అలాగే ఈ కాంగ్రెస్ పార్టీ విద్యార్థులకు ఇచ్చిన హామీలు విద్యార్థినిలకు స్కూటీలు, ల్యాప్ టాప్ లు ఇస్తామని దొంగ హామీలు ఇచ్చి మోసం చేసిన విధానం విద్యార్థిని విద్యార్థులకు వివరించడం జరిగింది. విద్యార్థులకు బాకీ ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ , స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయకపోతే రానున్న రోజుల్లో యువమోర్చా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు తీసుకొని ముందుకు సాగుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు..

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు, పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి, ఫీజుల బకాయి --బీజేపీ లడాయి' ఉద్యమం విద్యార్థుల హక్కుల కోసం ఉద్యమిస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

బిజెపి డిమాండ్స్ 15,000 వేల కోట్ల రూపాయలు ఇప్పటికీ చెల్లించలేదు. వెంటనే చెల్లించాలి.

- ఫీజులు సకాలంలో విడుదల కాకపోవడంతో విద్యార్థులు పరీక్షలు, సర్టిఫికెట్లు తీసుకోలేక, ఉన్నత విద్య విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. 40లక్షల విద్యార్థుల చదువులు ఉద్యోగ అవకాశాలు దెబ్బతినకుండా తగిన చర్యలు తీసుకోవాలి.
- ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.
- పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలన్నింటినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం.
- భవిష్యత్తులో కూడా ఫీజు రీయింబర్స్మెంట్ను ప్రతి విద్యా సంవత్సరం సకాలంలో విడుదల చేసే విధంగా స్పష్టమైన కార్యాచరణను ప్రకటించాలి.
- St, SC, BC విద్యార్థుల బంగారు భవిష్యత్తును కాపాడాలి.

ఈ కార్యక్రమంలో మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు జాకీర్ హుస్సేన్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు విజేందర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా నాయకులు నిశ్వంత్, మిద్దె రవి, సంతోష్, పరమేశ్, ప్రశాంత్, ప్రవీణ్, జయ ప్రకాష్, ఆనంద్ సింగ్ ,వెంకటేష్, సాయి, అరవింద్, భరత్, శివ, విష్ణు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి బాలానగర్లో అవగాహన కార్యక్రమం నిర్వహించిన ఎస్ఐ. నరేందర్ రెడ్డి

- **వివిధ రకాల సైబర్ మోసాలపై అవగాహన**
- **మోసపోతే వెంటనే 1930 కి ఫిర్యాదు చేయాలి**
- **అనుమానాస్పద లింకులు, కాల్స్ పట్ల జాగ్రత్త**
- **సైబర్ భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత**



జడ్చర్ల / బాలానగర్ / జులై 29, (విజన్ ఆంధ్ర): సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని బాలానగర్ ఎస్ఐ. నరేందర్ రెడ్డి సూచించారు. జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ ఆదేశాలతో ప్రతి బుధవారం చేపడుతున్న సైబర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా బాలానగర్ గ్రామంలో పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ. నరేందర్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొని సైబర్ నేరగాళ్లు వాడుతున్న మోసాల గురించి వివరించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు అనే ఇన్వెస్ట్మెంట్ ఆఫర్లు, లోన్ యాప్ మోసాలు, కేవైసీ అప్డేట్, ఓటీపీ అడుగు పేరుతో వచ్చే ఫోన్ కాల్స్, ఫేక్ లింకులు, వాట్సాప్ నకిలీ మెసేజ్లు, డిజిటల్ అరెస్ట్ వంటి వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే సమయం చాలా కీలకమని ఎస్ఐ చెప్పారు. మొదటి గంటలోనే 1930 టోల్ ఫ్రీ నెంబర్కు ఫిర్యాదు చేయాలని, http://www.cybercrime.gov.in వెబ్సైట్ లో కూడా ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. వెంటనే స్పందించడం ద్వారా పోగొట్టుకున్న డబ్బు తిరిగి వచ్చే అవకాశాలు ఉంటాయని వివరించారు. అనుమానాస్పద కాల్స్, మెసేజ్లు, లింకులను క్లిక్ చేయవద్దని, ఎవరికీ ఓటీపీ, బ్యాంక్ వివరాలు షేర్ చేయవద్దని పోలీసులు కోరారు. సైబర్ భద్రత అనేది ప్రతి పౌరుడి బాధ్యత అని, అప్రమత్తంగా ఉంటే మోసాలను నివారించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తరుణ్ మృతిపై ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా

గద్వాల జూలై 29 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి తరుణ్ ఆత్మహత్య ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్యూ జిల్లా అధ్యక్షుడు హరీష్ డిమాండ్ చేశారు. విద్యార్థి ఆత్మహత్యకు కారణమని ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంట్రాక్ట్ లెక్చరర్పై వెంటనే కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించాలని ఆయన కోరారు. అలాగే తరుణ్ కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు గద్వాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించారు. తరుణ్ మృతికి గల



కారణాలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

విద్యార్థి మరణ ఘటనపై న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని విద్యార్థి సంఘాల నాయకులు స్పష్టం చేశారు.



## చారకొండ జెడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా డాక్టర్ సి. నారాయణ రెడ్డి జయంతి వేడుకలు

చారకొండ,జూలై 29:(విజన్ ఆంధ్ర) : క్లాస్ మేట్ క్లబ్ ఆధ్వర్యంలో చారకొండ జెడ్పీహెచ్ఎస్‌లో ప్రముఖ కవి,జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి. నారాయణ రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీ పి.అంజయ్య,ఉపాధ్యాయ బృందం,క్లాస్ మేట్ క్లబ్ సభ్యుడు శ్రీ కరుణాకర్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు పద్య పఠనం,ఉపన్యాసం, వ్యాసరచన పోటీలను నిర్వహించి,ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వక్తలు డాక్టర్ సి. నారాయణ రెడ్డి తెలుగు సాహిత్యానికి అందించిన విశిష్ట సేవలను గుర్తు చేస్తూ,ఆయన రచనలు విద్యార్థులకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు

## పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



మిడ్జిల్,29 జూలై (విజన్ ఆంధ్ర ) : మిడ్జిల్ మండల కేంద్రంలో మున్ననూర్ గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ మండల నాయకులు కాకునూరు జై పాల్ రెడ్డి తండ్రి ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరమర్శించిన మాజీ మంత్రి వర్యులు డాక్టర్ సి.లక్ష్మారెడ్డి అనంతరం ఇటీవల అనారోగ్యంతో సర్జరీ చేయించుకున్న ఆంధ్ర రాఘవ రెడ్డి ని పరామర్శించారు. అదేవిదంగా కుచ్చర కంటి రాఘవ రెడ్డి తండ్రి గత మూడు రోజులక్రితంమరణించడంతో వారి కుటుంబ సభ్యులను. పరామర్శించటం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ .యస్ మండల అధ్యక్షులు పాండు యాదవ్,మాజీ ఎంపీపీ సుదర్శన్ బరిగెల, మాజీ జడ్పీటీసీ శశి రేఖాబాలు,దోనూర్ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్,యూత్ వింగ్ అధ్యక్షులు బంగారు నాయకులు జగన్ గౌడ్,నామాని శ్రీనివాసులు,శేఖర్ రెడ్డి రాజేందర్ రెడ్డి,మల్లయ్య మధు,యాదయ్య,బాల్ రాజ్, అమృతయ్య, వెంకటయ్య,మహేష్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎస్సీ డిపార్ట్మెంట్ జనరల్ సెక్రటరీగా నియమితులైన కొంకి వెంకటేష్‌కు ఘన సన్మానం

గోపాల్ పేట్ జూలై 29(విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ జనరల్ సెక్రటరీగా నూతనంగా నియమితులైన కొంకి వెంకటేష్‌ను వనపర్తి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కే. శివసేనారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీ పట్ల కొంకి వెంకటేష్ చూపుతున్న నిబద్ధత, క్రమశిక్షణ, ప్రజా సేవా దృక్పథాన్ని గుర్తించి పార్టీ అధిష్ఠానం ఈ కీలక బాధ్యతను అప్పగించిందన్నారు. ఈ పదవికి ఆయన పూర్తి న్యాయం చేస్తూ ఎస్సీ వర్గాల అభ్యున్నతికి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కొంకి వెంకటేష్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, రాష్ట్ర నాయకత్వం ఆశయాలకు అనుగుణంగా ఎస్సీ డిపార్ట్మెంట్‌ను మరింత బలోపేతం చేయడానికి నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు.

# సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలి

**- మండల ప్రత్యేక అధికారి నూకరాజు**

గద్వాల జూలై 29 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి నూకరాజు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి 45 రోజులకు ఒకసారి నిర్వహించే మండల సమావేశంలో భాగంగా ఈరోజు గద్వాల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి నూకరాజు అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ, మండలంలోని అభివృద్ధి పనులు,సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో, ఎంపీవోలు మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు,సంక్షేమ పథకాల అమలు, వివిధ శాఖల పనుల పురోగతిపై తమ ప్రగతి నివేదికలను సమర్పించారు.

అనంతరం వ్యవసాయ శాఖ అధికారి,మిషన్ భగీరథ ఏఈ, మండల విద్యాధికారి (ఎంఈఓ), రెవెన్యూ శాఖ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు,ఏపీఓ, ఏపీఎం,ఐసీడీఎస్ సూపర్వైజర్, పశుసంవర్ధక శాఖ అధికారి, హౌసింగ్ ఏఈ తదితరులు తమ శాఖల ప్రగతి నివేదికలను వివరించారు. అలాగే గౌరవ సభ్యులు ప్రస్తావించిన వివిధ సమస్యలు, ప్రజా అవసరాలపై స్పందిస్తూ తగిన వివరణలు అందించారు. రానున్న రెండవ మండల సమావేశానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పూర్తి స్థాయి ఎజెండా అంశాలతో హాజరుకావాలని, ప్రతి అధికారి తన విధులను సేవా నియమావళి (సర్వీస్ రూల్స్)కు అనుగుణంగా బాధ్యతాయుతంగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి సూచించారు.

ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు,వీబీజీ రామ్-జీ సిబ్బంది,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కానయపల్లి టీమ్రీస్ మైనార్టీ బాయ్స్ రెసిడెన్షియల్‌కు ప్రభుత్వ సొంతం బిల్డింగ్ ఏర్పాటు చెయ్యాలి.

**.. అవాజ్ రాష్ట్ర అధ్యక్షులు యండి జబ్బార్ డిమాండ్**

కొత్తకోట జూలై 29 (విజన్ ఆంధ్ర) : కొత్తకోట మండలం లోని కానయాపల్లిలో కొనసాగుతున్న బాలుర రెసిడెన్సియల్ స్కూల్లో అవాజ్ కమిటీ బుధవారం నాడు పరిశీలన చెయ్యడం జరిగింది ఈ సందర్భముగా ప్రిన్సిపల్ శిరీష గారిని అవాజ్ మరియు సీఐటీయూ బృందం పాఠశాల వివరాలు అడిగి పరిశీలన చెయ్యగా 350మంది విద్యార్థులు 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఉన్నారు ఉపాధ్యాయు లు 18 మందిఉన్నారు అందులో 6 కాంట్రాక్ట్ బేసిక్ టీచర్లు ఉ న్నారు. 5.6.7.తరగతుల విద్యార్థుల కు 50రు. చొప్పున మరియు 8.9.10 విద్యార్థులకు 70 రు చొప్పున ప్రతి విద్యార్థికి మెనూ ఇస్తున్నారు. ఇప్పుడున్న రెట్లకు సరిపోవడం లేదుఅని అన్నారు అవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు యండి జబ్బార్ మాట్లాడుతూ 5.6.7. తరగతులకు మెనూ 100రు. 8.9.10.తరగతులకు మెనూ 150రు. చొప్పున ప్రతి విద్యార్థికి ప్రభుత్వం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇట్టి రెసిడెన్సియల్ కోసం స్థలం గతములో 7 ఎకరాల భూమి కొన్నారు. కానీ భూమి ఇప్పుడు లేదని తెలుస్తుంది అదే భూమిలో రెసిడెన్సియల్ భవనం నిర్మాణం చెయ్యాలని డిమాండ్ చేశారు సైకిలింగ్ బియ్యం పెట్టి సన్న బియ్యం అని అంటున్నారు కానీ భోజనాలు నాణ్యవంతముగ లేవు విద్యార్థులకు పడక గదులు ఇరుకుగా ఉండి ఫ్యాన్ల సౌకర్యము సరిగా లేక రాత్రి వేళలో ఉక్కపోతలకు గురై అనారోగ్యానికి గురౌతున్నారు అని అన్నారు. కాంట్రాక్ట్ బేసిక్ ఉపాధ్యాయులకు నెలకు 26000 వేల వేతనం ఇవ్వాలని మరియు వంట కుక్కర్లకు వేతలను పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు పై సమస్యల పైన కలెక్టర్ దృష్టికి తీసుకోస్తామని చెప్పారు. ఇట్టి కార్యక్రమములో అవాజ్ జిల్లా కార్యదర్శి యండి ఖాజా సీఐటీయూ జిల్లా కోశాధికారి బొబ్బిలి నిక్సన్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్లో ఉన్న పిఎఫ్,ఈఎస్ఐ కార్మికుల ఖాతాలో జమ చేయాలి

**మున్సిపల్ కమిషనర్ రాజేష్ కి వినతి పత్రం అందజేసిన --సిఐటియు**



అలంపూర్ జూలై 29 (విజన్ ఆంధ్ర) : అలంపూర్ మున్సిపల్ కార్మికులకు పెండింగ్ లో ఉన్న 16 నెలల పిఎఫ్, ఈఎస్ఐ వెంటనే వారి ఖాతాలో జమ చేయాలని సిఐటియు.జిల్లా అధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ డిమాండ్ చేశారు. బుధవారం అలంపూర్ మండల కేంద్రంలో మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించి, కమిషనర్ రాజేష్ కి వినతిపత్రం అందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,అలంపూర్ మున్సిపల్ కార్మికులకు గత 16 నెలలుగా పిఎఫ్,ఈఎస్ఐ వారి ఖాతాలో జమ చేయలేదని, కార్మికుల కోసం కేటాయించిన నిధులను వేటి కోసం ఖర్చు చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.కార్మికుల ఖాతాలో సక్రమంగా పిఎఫ్,ఈఎస్ఐ జమ చేయకపోతే కార్మికులు రుణాలు, మరణానంతరం, తమ కష్టార్జితాన్ని తీసుకునే సందర్భంలో అధికారులే అనేక కొర్రీలు( సందేహాలు) పెడతారని విమర్శించారు.అధికార యంత్రాంగం చేసే తప్పిదాలకు కార్మికులు ఎందుకు బలి కావాలని ప్రశ్నించారు.వేతనం కార్మికుల ఖాతాలో జమ చేసినప్పుడు, పిఎఫ్,ఈఎస్ఐ చెల్లింపులో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు.నెలకు ఒకసారి కార్మికులకు ఇవ్వవలసిన సబ్బులు, నూనెలు,బెల్లం మాస్కు తదితరాలను నెలల తరబడి పెండింగ్ లో ఉంచుతున్నారని,నిరంతరం అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు అందించాల్సిన పరికరాలు కూడా ఇవ్వకుండా కాలయాపన చేయడం సరికాదని విమర్శించారు. అదేవిధంగా అలంపూర్ మున్సిపాలిటీలో 17 మంది కార్మికులు సంవత్సరాల తరబడి రోజువారి కార్మికులుగా పనిచేస్తున్నారని,వారిని సైతం ఔట్సోర్సింగ్ కార్మికులుగా గుర్తించి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఘట్టన్న, నాయకుల లక్ష్మన్న,యేసేపు, ప్రభుదాస్, లక్ష్మీదేవి, నాగేషమ్మ,రేణుక, మునిస్వామి,వెంకటేష్,బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

## మళ్లి తెగిన మట్టి వంతెన ఆగిపోయిన ధర్మారం - సోన్ రాకపోకలు. భారికేడ్ లు అడ్డుగా పెట్టించిన ఎస్ఐ, ధర్మారం సర్పంచ్

నిర్మల్. జులై 29. ( విజన్ ఆంధ్ర ) : నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం ధర్మారం మీదుగా సోన్ వెల్లే రహదారి పై వేసిన వంతెన మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొట్టుకుపోవడంతో అప్రమత్తమైన ఎస్ఐ శ్రావణి ధర్మారం సర్పంచ్ బుర్ర ముత్యం గ్రామస్తులతో కలిసి రోడ్డుకు అడ్డుగా భారికేడ్ లు ఏర్పాటు చేసి వాహనాలకు అంతరాయం లేకుండా చేసారు. కాగా ఈ మట్టి వంతెన తెగిపోవడం నాలుగవసారి. లక్ష్మణచాంద మామడ మండలాల ప్రజలు సోన్ మీదుగా నిజాంబాద్ వెల్లే మార్గం కావడంతో ఈ దారిపై వాహనాల రద్దీ ఎక్కువ.ఇకనైనా శాశ్వత వంతెన నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు

## శ్రీరామ పట్టాభిషేక మహోత్సవానికి తిరుపతి రెడ్డికి ఆహ్వానం
### శ్రీకృష్ణ కాలచక్రం మహాయజ్ఞ హోమ కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వాన పత్రిక అందజేత

కల్వకుర్తి జూలై29 (విజన్ ఆంధ్ర) : కల్వకుర్తి బీఎస్ఎన్ఎల్ గ్రౌండ్ లో నిర్వహించనున్న శ్రీకృష్ణ కాలచక్రం మహాయజ్ఞ హోమ కార్యక్రమంలో భాగంగా జరగనున్న శ్రీరామ పట్టాభిషేక మహోత్సవానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డిని నిర్వాహకులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీచని బాలకృష్ణ, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు వాస శేఖర్, మాజీ ఎంపీటీసీ కల్మిచర్ల గోపాల్ లు కలిసి తిరుపతి రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేసి, మహాయజ్ఞ హోమ కార్యక్రమం, శ్రీరామ పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఈ సందర్భంగా మహాయజ్ఞం ద్వారా లోకక్షేమం, ప్రజల సుఖశాంతి, రాష్ట్రాభివృద్ధి కోసం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# అక్షరవనం విద్యా విధానం ఆదర్శనీయం

### గురుపూర్ణిమ సందర్భంగా విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ

కల్వకుర్తి జూలై29 (విజన్ ఆంధ్ర) : కల్వకుర్తి పట్టణంలోని అక్షరవనం ఆశ్రమ పాఠశాలను బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ సందర్శించారు. పాఠశాలలో అమలు చేస్తున్న వినూత్న విద్యా విధానాన్ని పరిశీలించి, విద్యార్థులు స్వయంగా వంట చేయడం, గోశాల నిర్వహణ, తోటపని వంటి జీవన నైపుణ్యాలను అభ్యసిస్తూ పాఠశాల నిర్వహణలో భాగస్వాములు కావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ, ప్రాచీన భారత గురుకుల విద్యా విధానాన్ని తలపించేలా విద్యతో పాటు ఆచరణాత్మక జ్ఞానాన్ని అందిస్తున్న అక్షరవనం ఆశ్రమ పాఠశాల ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కేవలం పుస్తక విద్య మాత్రమే కాకుండా జీవన నైపుణ్యాలు కలిగిన విద్యే సమాజానికి అవసరమని, భారతీయ సనాతన సంస్కృతిలో గొప్ప విద్యా సంప్రదాయం దాగి ఉందని తెలిపారు. ఇలాంటి ఆశ్రమ పాఠశాలలు మరిన్ని ఏర్పడాలని ఆకాంక్షించారు.

గురుపూర్ణిమ సందర్భంగా అక్షరవనం వ్యవస్థాపకుడు ఎడ్మ మాధవరెడ్డి, ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి, విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.



మొదటిసారిగా కల్వకుర్తికి విచ్చేసిన ఆనంద్ గౌడ్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జెట్టి వెంకటేష్‌కు కల్వకుర్తి పట్టణ బీజేపీ అధ్యక్షుడు గన్నోజు బాబిదేవ్ శాలువాలతో ఘన స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో జాతీయ ఓబీసీ మోర్చా కన్వీనర్ పెరిక సురేష్, రాష్ట్ర ఓబీసీ ఉపాధ్యక్షుడు రఘురామయ్య గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి సుమన్ గౌడ్, రాష్ట్ర కోశాధికారి ఆకారపు సురేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు, 11వ వార్డు కౌన్సిలర్ ఏనుగొండ రామకృష్ణ, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ మాయని రాజశేఖర్, మాజీ మార్కెట్ కమిటీ సభ్యుడు గుండోజు గంగాధర్, ఓబీసీ మోర్చా నాయకులు రమేష్, శ్రీనివాస్, పాండు, కిరణ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గురువులకు సన్మానం

### - గురు బ్రహ్మా: గురు విష్ణు: గురు సాక్షాత్ పరబ్రహ్మా: తస్మయే శ్రీ గురవే నమః



కొత్తకోట జులై 29 (విజన్ ఆంధ్ర): కొత్తకోట పట్టణం లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కొంత మంది గురువులకు బీజేపీ ఎండోమెంట్ సెల్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎండోమెంట్ మెంట్ సెల్ జాయింట్ కన్వీనర్ శ్రీమతి కొత్తకోట శ్వేతా పాండు రంగారెడ్డి పాల్గొని గురువులను సన్మాణించడం జరిగింది.

విశ్రాంతా ఉపాధ్యాయులు శ్రీ రవీందర్ రెడ్డి,నూర సత్యనారాయణ,లక్ష్మి నారాయణ గుప్త,సుదర్శన్ శెట్టి, నరసింహులు నాయుడు,మొహమ్మద్ సలీం గార్లను వారి వారి గృహాలకు వెల్లి సన్మాణించడం జరిగింది. ఈ కార్యక్రమం లో శ్రీమతి చింతల పల్లి రాదా రెడ్డి ఎండోమెంట్ వనపర్తి జిల్లా కన్వీనర్,శ్రీమతి కవితా రెడ్డి, సభిరెడ్డి నారాయణమ్మ వెంకట్ రెడ్డి,కొమ్ము భరత్ భూషణ్, మద్దిగట్ల శ్రీనివాస్ రెడ్డి, పబ్బ నరేందర్ గౌడ్, వనపర్తి శ్రీనివాస్ రెడ్డి, రాచాల మన్యం, కొమ్ము సురేష్, గందు రవీందర్ రెడ్డి, స్టార్ బాలు, రామకృష్ణా రెడ్డి,చింతల పల్లి వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వరా చారీ తదితరులు ప్రొసల్గొన్నారు.

## భీమా ఫేజ్-I పంప్ హౌస్ నుండి అధికారులతో కలసి దిగువకు నీటిని విడుదల చేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డివనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి

కొత్తకోట జులై 29 (విజన్ ఆంధ్ర): దేవరకద్ర నియోజకవర్గం,కొత్తకోట, మదనపురం మండలాల శివార్లలోని భీమా ఫేజ్-1... స్టేజ్ -1 పంప్ హౌస్ నుండి అధికారులతో కలసి దిగువకు నీటిని విడుదల చేసిన దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ. జి. మధుసూదన్ రెడ్డి వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి నీటి విడుదల అనంతరం ఎమ్మెల్యేలు +వీ= ,మేఘా రెడ్డి మాట్లాడుతూ భీమా ఫేజ్ 1 పంప్ హౌస్ నుంచి దిగువకు నీటిని విడుదల చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఎగువన కర్ణాటక నుండి జూరాల వస్తున్న వరదను దృష్టిలో ఉంచుకొని, ఎప్పటికప్పుడు జూరాలలో ఉన్న నీటి మట్టాన్ని పరిశీలిస్తూ



రైతుల వ్యవసాయ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సాగునీటిని విడుదల చేస్తున్నాం. రెండు రోజుల క్రితం కోయిల్ సాగర్ కు ఉంద్యాల పంప్ హౌస్ నుండి నీటిని విడుదల చేయడం జరిగిందని తెలియజేశారు. ఈరోజు భీమా ఫేజ్-1... స్టేజ్ -1 పంప్ హౌస్ నుండి దిగువకు నీటిని విడుదల చేయడం జరిగిందని అన్నారు మీడియాకు తెలియాజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్మించిన ప్రాజెక్టుల వల్లనే నేడు ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైతాంగానికి సాగునీరు, తాగునీరు అందుతుందని ఈ సంధర్భంగా శాసన సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మదనాపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రశాంత్ కొత్తకోట మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పల్లవి కృష్ణారెడ్డి . కరుణాకర్ రెడ్డి టి సి నాగన్న యాదవ్ కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి భీమ చంద్రకాంత్ సంజీవుడు టౌన్ ప్రెసిడెంట్ దేశ్ పెంటన్న యాదవ్ శంకర్ యాదవ్ సాయిల్ యాదవ్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

లింగాపూర్ జులై 29(విజన్ ఆంధ్ర )లింగాపూర్ మండలంలోని జగదాంబ దేవి ఆలయంలో భక్తిశ్రద్ధలతో గ్రామస్తులు బుధవారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. అనంతరం జగదంబ దేవి సేవలాల్ మహారాజ్ కు ప్రత్యేక పూజలు నిర్వహించి భుప దిప నైవేద్యాలు సమర్పించి గ్రామస్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ పూజ కార్యక్రమంలోరాథోడ్,మంగులాల్ మహారాజ్,ఆడే,హసీరామ్,పవార్ దేవిదాస్,జాదవ్,వినోద్,రాథోడ్,భీంరావ్,గ్రామస్తులు పాల్గొన్నారు.

# నవాబ్‌పేట్ జెడ్.పి.హెచ్.ఎస్.లో జె.కె. ట్రస్టు ఆధ్వర్యంలో రాధాకృష్ణన్ విగ్రహా ఆవిష్కరణ

విద్యార్థులే దేశ భవిష్యత్తు: శాసనసభ్యులు అనిరుధ్ రెడ్డి
- మహనీయుల ఆశయాలు విద్యార్థులకు ఆదర్శం
- ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- జె.కె. ట్రస్టు సేవలు అభినందనీయం
- కీ.శే. జగదీశ్వర చారి, కీ.శే. కళావతమ్మ జ్ఞాపకార్థం విగ్రహా ప్రతిష్ఠ
- సేవా కార్యక్రమాల్లో జె.కె. ట్రస్టు ముందుంటుంది



జడ్చర్ల / నవాబ్‌పేట్ / జులై 29,(విజన్ ఆంధ్ర) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం నూతనంగా ప్రతిష్ఠించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. జె.కె. కుటుంబ ట్రస్టు ఆధ్వర్యంలో కీ.శే. జగదీశ్వర చారి, కీ.శే. కళావతమ్మ జ్ఞాపకార్థం ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో జె.కె. ట్రస్టు సభ్యులు, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రముఖులు, కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన శాసనసభ్యులు అనిరుధ్ రెడ్డి, డాక్టర్ రాధాకృష్ణన్ జీవితం ప్రతి విద్యార్థికి స్ఫూర్తి అని అన్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత యువతపై ఉందని చెప్పారు.

విద్యతోనే సమాజ ప్రగతి సాధ్యం అని శాసనసభ్యులు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మౌలిక వసతుల అభివృద్ధితో పాటు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా రంగానికి చేసిన సేవలు మరువలేనివని, ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్ ను తీర్చిదిద్దాలని అన్నారు. దివంగతుల జ్ఞాపకార్థం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని జె.కె. కుటుంబ ట్రస్టును ప్రశంసించారు. విద్యారంగ అభివృద్ధిలో ట్రస్టు చేస్తున్న కృషి ఆదర్శప్రాయమని కొనియాడారు. విద్యార్థులు చదువుతో పాటు సంస్కారాన్ని కూడా అలవర్చుకోవాలని కోరారు. పాఠశాలలకు అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు పాల్గొన్నారు.

# నిఘా వ్యవస్థను పటిష్ట పరచాలి

నిజామాబాద్ జులై29:( విజన్ ఆంధ్ర) :బుధవారం నాడు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాదు రూరల్ పోలీస్ స్టేషన్‌ను లిగౌరవనీయులు నిజామాబాదు పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐ. పి. ఎస్.,వార్షిక తనిఖీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్ గారికి పోలీస్ అధికారులు , సిబ్బంది గౌరవ వందనం అందించగా , ఆయన వందనాన్ని స్వీకరించి అనంతరం , మొక్క నాటడం జరిగింది తదుపరి స్టేషన్‌లోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

మొదటగా స్టేషన్‌లో సిబ్బందికి అందుబాటులో ఉన్న కిట్ ఆర్టికల్స్ , భద్రతా పరికరాలు , ఆయుధాల నిర్వహణ , రికార్డుల సంరక్షణ తదితర అంశాలను పరిశీలించి వాటి నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం రిసెప్షన్ సెంటర్‌ను సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న రిజిస్టర్లు , ఫిర్యాదుల నమోదు విధానం , ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని గౌరవంతో స్వాగతించి , వారి సమస్యలను ఓర్పుతో విని వెంటనే స్పందించే విధంగా సిబ్బంది వ్యవహరించాలని సూచించారు.

తదుపరి పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న అన్ని రకాల రికార్డులను పరిశీలించిన కమిషనర్ గారు , కేసుల నమోదు , పెండింగ్ కేసుల దర్యాప్తు , బీట్ డ్యూటీ వ్యవస్థ , రౌడీషీటర్లు మరియు నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై పర్యవేక్షణ వంటి అంశాలను సమగ్రంగా తనిఖీ చేశారు. కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే స్టేషన్‌లో అమలవుతున్న "5 ఎస్ విధానం" అమలు తీరును సమీక్షించి , ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించడంలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మహిళలు , వృద్ధులు , అత్యవసర సహాయం కోసం వచ్చే ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకొని స్పందించాలని తెలిపారు.

స్టేషన్ పరిసరాల పరిశుభ్రత , రికార్డుల డిజిటల్ నిర్వహణ , సిబ్బంది హాజరు , డ్యూటీ విధానాలు తదితర అంశాలపై కూడా పోలీస్ కమిషనర్ గారు ఆరా తీశారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెరిగేలా క్రమశిక్షణతో , పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు.

ప్రధానంగా అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల చేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని , ప్రతి కేసులో నాణ్యమైన , ఇన్వెస్టిగేషన్ చేయాలని సబ్ ఇన్స్పెక్టర్ కు సూచనలు చేశారు.

ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాలు జరుగుతున్నాయని, సైబర్ క్రైమ్స్ గురించి వివిధ పాఠశాలలు , కళాశాలలో మరియు సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు.

పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో గల విలేజ్ పోలీస్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై ఆ ప్రాంతాలలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేసి , అట్టి ప్రాంతాలలో ఉన్నటువంటి సమాచారము తమపై స్థాయి అధికారులకు ఎల్లప్పుడూ చేరవేయాలి అన్నారు.

నిజామాబాదు రూరల్ పోలీస్ స్టేషన్ సరిహద్దులో ఉన్నటువంటి అన్నీ ప్రధాన రహదారులపై నిఘా పటిష్టపరిచాలని అన్నారు.

ప్రతి రోజు ట్రాఫిక్ సమస్య అధిగమించడానికి ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ చేయాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలు సూచనలు చేశారు. సులభ మార్గంలో అధిక డబ్బులు సంపాధించాలనే అత్యాశతో యువత ఆన్లైన్ బెట్టింగ్స్ ఆన్లైన్ గేమ్స్ ఆడుతూ, సైబర్ మోసగాళ్ళ చేతిలో చిక్కి డబ్బులు కోల్పోతూ అప్పులు చేసి , చేసిన అప్పులను తీర్చలేక తనువును చాలిస్తున్నారని అన్నారు. గేమింగ్ యాప్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.డ్రగ్స్ నియంత్రణ కోసము యువతను ఎల్లప్పుడూ చైతన్యవంతులను చేయాలని మరియు అన్ని గ్రామాలలో డ్రగ్స్ వాడకం నిషేధము అని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు. ప్రతీ కేసులో ఇన్వెస్టిగేషన్ నందు ప్రస్తుతం ఉన్నటువంటి టెక్నాలజీ పద్ధతులను ఉపయోగించుకోవాలని అన్నారు.అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ అధికారులు మరియు సిబ్బంది 24x7 తమ హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలని , దూర ప్రాంతాల నుండి ప్రయాణాలకు దూరంగా ఉండాలని , సిబ్బంది ప్రతి ఆరు నెలలకు ఒకసారి తమ హెల్త్ చెకప్ చేయించుకోవాలని, ముఖ్యంగా బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు.ఈ తనిఖీలో నిజామాబాదు ఏ.సి.పి శ్రీ బి. ప్రకాష్ యాదవ్ , సి.సి.ఆర్.బి ఏ.సి.పి శ్రీ గురు నాయుడు , నిజామాబాదు రూరల్ ఎస్.హెచ్.ఓ శ్రీ సి. హెచ్. శ్రీనివాస్ , ఎస్.ఐ 1 శ్రీ ఎమ్.డి షరీఫ్ , ఎస్.ఐ 2 శ్రీ ఎ. ఆనంద్ సాగర్ , ఎస్.ఐ 3 శ్రీ ఎ. మహేష్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



నల్లబెల్లి,జూలై 29(విజన్ ఆంధ్ర): మండలంలో విబి జి రాంజీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వివిధ కేటగిరీలలో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు గత మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని కావున త్వరగా వేతనాలు అందజేయాలని కోరుతూ బుధవారం తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదకు స్థానిక పోస్ట్ ఆఫీస్ ద్వారా వినతి పత్రం పంపించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.......గత మూడు నెల నుండి వేతనాలు రాక విబి జి రాంజీ గ్రామీణ ఉపాధి హామీ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.అలాగే విబి జి రాంజీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగస్తులు సుదీర్ఘ కాలం పని చేయడం వల్ల అవినీతి అక్రమాలు పాల్పడే అవకాశం ఉన్నందున వెంటనే బదిలీలు చేపట్టాలని కలెక్టర్ ను వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు

## గురుపూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించిన శ్రీ అక్షర పాఠశాల

### - ఉపాధ్యాయులను సన్మానించిన యాజమాన్యం

### - భావోద్వేగానికి గురిచేసిన విద్యార్థుల ప్రసంగాలు

ముధోల్, జూలై 29:విజన్ ఆంధ్ర. గురువు జీవితంలో వెలుగునిచ్చే దైవస్వరూపుడని చాటి చెబుతూ ముధోల్ పట్టణంలోని శ్రీ అక్షర పాఠశాలలో బుధవారం గురుపూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ గురువులకు పాదపూజ చేసి పూలు సమర్పించి ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో విద్యార్థులు మాట్లాడుతూ, "సార్... మీరు మందలించినప్పుడు బాధపడ్డాం. కానీ ఈ రోజు మీ బోధన వల్లే ఈ స్థాయికి చేరుకున్నామని అర్థమైంది" అంటూ తమ గురువుల పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేయడంతో అక్కడున్న వారంతా భావోద్వేగానికి గురయ్యారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల డైరెక్టర్ జే. సుభాష్ మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి గొప్పతనాన్ని వివరించారు. ఒక ఇంజనీర్, డాక్టర్, కలెక్టర్, శాస్త్రవేత్తను తీర్చిదిద్దేది గురువేనని, దేశ భవిష్యత్తుకు పునాదులు తరగతి గదిలోనే వేయబడతాయని అన్నారు.

విద్యార్థులు గురువులను గౌరవించడం ద్వారానే నిజమైన విద్య సార్థకమవుతుందని, గురువులను గౌరవించే విద్యార్థులే రేపటి ఆదర్శ పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. అనంతరం వ్యాసమహర్షి ప్రాముఖ్యత, గురుపూర్ణిమ చరిత్రను విద్యార్థులకు వివరించారు.

కార్యక్రమం ముగింపులో పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించింది. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని గురుపూర్ణిమ వేడుకలను విజయవంతం చేశారు.

## పరిశ్రమల్లో భద్రతే తొలి ప్రాధాన్యం..

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో పరిశ్రమలకు ప్రభుత్వం ఎక్కువ స్వేచ్ఛ కల్పించిందని, అయితే ఆ స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా పెరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వ జోక్యం లేకుండానే పరిశ్రమలు స్వయంగా అత్యున్నత భద్రతా ప్రమాణాలను పాటించే సంస్కృతిని అలవర్చుకోవాలని సూచించారు.

సిగాచి ఘటన ప్రతి పరిశ్రమకు హెచ్చరికగా నిలవాలని మంత్రి అన్నారు. రూ.15 నుంచి రూ.20 లక్షల వరకు భద్రతా చర్యల కోసం ఖర్చు చేయకపోవడం వల్ల అమూల్యమైన ప్రాణనష్టంతో పాటు సంస్థకు వందల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని గుర్తుచేశారు. స్వల్ప వ్యయాన్ని ఆదా చేయాలనే ఆలోచన చివరకు భారీ మూల్యం చెల్లించే పరిస్థితిని తీసుకొస్తుందని హెచ్చరించారు.

ప్రతి కంపెనీ బోర్డు సమావేశంలో పారిశ్రామిక భద్రతపై ప్రత్యేక సమీక్ష తప్పనిసరిగా నిర్వహించాలని మంత్రి సూచించారు. ఫ్యాక్టరీ ఆక్యుపైయర్, బోర్డు సభ్యులు భద్రతా ప్రమాణాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని, భద్రత కోసం చేసే ఖర్చును వ్యయంగా కాకుండా పెట్టుబడిగా చూడాలని అన్నారు.

పరిశ్రమల్లో భద్రత పెరిగితే కార్మికుల్లో విశ్వాసం పెరిగి ఉత్పాదకత కూడా గణనీయంగా మెరుగవుతుందని పేర్కొన్నారు. కార్మికులకు తరచూ సేఫ్టీ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, కొత్త సాంకేతికతలు, ఉత్తమ భద్రతా విధానాలను అమలు చేయాలని సూచించారు. ఇటువంటి వర్క్‌షాప్‌లు ప్రభుత్వం, పరిశ్రమలు పరస్పరం నేర్చుకునేందుకు ఉపయోగపడతాయని తెలిపారు.

ప్రమాదకర విభాగాల్లో కాంట్రాక్ట్ కార్మికులను నియమించొద్దని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సిగాచి ఘటనలో ప్రమాదకర విభాగాల్లో పనిచేసిన కాంట్రాక్ట్ కార్మికులకు తగిన అనుభవం, శిక్షణ లేకపోవడం కూడా ఒక కారణమని పేర్కొన్నారు. ప్రమాదకర కార్యకలాపాలు జరిగే విభాగాల్లో కంపెనీ శాశ్వత ఉద్యోగులే విధులు నిర్వహించేలా వచ్చే ఆరు నెలల్లో తగిన నిబంధనలు రూపొందించాలని ఫ్యాక్టరీల శాఖ అధికారులను ఆదేశించారు.

అదేవిధంగా కంబస్టిబుల్ డస్ట్, గ్యాస్ లీకేజీలు వంటి ప్రమాదకర అంశాలపై ప్రత్యేక భద్రతా మార్గదర్శకాలు రూపొందించి అన్ని పరిశ్రమల్లో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఫ్యాక్టరీల శాఖ డైరెక్టర్‌కు మంత్రి సూచించారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ విషయంలో ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా ఉందని, కార్మికుల ప్రాణ భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో సీఎస్ఐఆర్ శాస్త్రవేత్త డా. సూర్యనారాయణ, ఫ్యాక్టరీల శాఖ డైరెక్టర్ మోహన్ బాబు, నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ తెలంగాణ చాప్టర్ ప్రతినిధులు, వివిధ పరిశ్రమలకు చెందిన సీనియర్ అధికారులు, నిపుణులు, సిమెంట్, ఫుడ్ ప్రాసెసింగ్, కోల్, టెక్స్టైల్ తదితర రంగాలకు చెందిన సుమారు 300 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాష్ట్రమంత్రి వివేక్ వెంకటస్వామిని కలిసిన గుండ్లమా చు నూర్ సర్పంచ్ శ్రీహరి



విజన్ ఆంధ్ర హత్తుర హత్నూర జూలై 29: రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని గుండ్ల మాచునూర్ గ్రామ సర్పంచ్ శ్రీహరి బుధవారం హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వినతి పత్రాన్ని సమర్పించారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు, పెండింగ్ అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ శ్రీహరి తెలిపారు.

## యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూలును సందర్శించిన జిల్లా విద్యాధికారి చీరంశెట్టి రమేష్



కోహెడ విజన్ ఆంధ్ర జూలై 29 : కోహెడ మండలం తంగళ్ళపల్లి గ్రామంలో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలను బుధవారం జిల్లా విద్యాధికారి చీరంశెట్టి రమేష్ సందర్శించారు.సందర్శనలో భాగంగా ఏఏ బ్లాక్ లు పూర్తికావస్తున్నాయి,వాటి నాణ్యత ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయో పరిశీలించారు.వచ్చే విద్యా సంవత్సరం వరకు పాఠశాల నిర్మాణము పూర్తిస్థాయిలో కంప్లీట్ అవుతుందని సైట్ ఇంజనీర్ జిల్లా విద్యాధికారి కి వివరించారు.స్కూల్ మానిటరింగ్ లో భాగంగా తంగళ్ళపల్లి ఉన్నత పాఠశాలను కూడా ఈరోజు సందర్శించారు.పాఠశాల రికార్డులను పరిశీలించి,విద్యార్థులకు నాణ్యమైన విద్యను,మెనూ ప్రకారం పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏ.మహేందర్ రెడ్డి,ఎం.సురేందర్ రెడ్డి,బి.శ్రీరాములు,సిఆర్పి రాజేశం,తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా చూడాలి

కుల్కచర్ల, జులై, 29 ( విజన్ ఆంధ్ర): అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా చూడాలని బీజేపీ పరిగి అసెంబ్లీ ఇంచార్జి మారుతీ కిరణ్ తెలిపారు. కుల్కచర్ల మండలంలోని పలు గ్రామాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటించి ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించామన్నారు. ఓటరు నమోదు, సవరణలు, తొలగింపులను జాగ్రత్తగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ ఓటు హక్కును కోల్పోకుండా ఉండాలంటే వివరాలన్నీ ఎస్ఐఆర్ ఫారంలో జాగ్రత్తగా నమోదు చేసి బీఎల్ఓలకు అందించాలని తెలియజేశారు. కార్యక్రమంలో కుల్కచర్ల సర్పంచి అంజిలయ్య, ఉప సర్పంచి విజయ్ కుమార్, టెలికం అడ్వైజరీ బోర్డు సభ్యులు వెంకటయ్య గౌడ్, దిశా కమిటీ సభ్యులు జానకీరాం, నాయకులు మహిపాల్, హన్మంతు, కేశవులు, కర్ణయ్య, రాంచెంద్రయ్య, బీఎల్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రాపై రాజకీయాలు చేయొద్దు

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్
-హైకోర్టు తీర్పును ఏకపక్షంగా వ్యాఖ్యానించడం సరికాదు
-హైడ్రా చర్యలతో ఎక్కువగా నష్టపోయింది కబ్జాదారులేనని వ్యాఖ్య
-చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల పరిరక్షణకు హైడ్రా అవసరమేనని అభిప్రాయం
-పరికి చెరువు అక్రమ నిర్మాణాలపై చర్యల్లో వైఫల్యాన్ని తప్పుబట్టిన సీపీఐ
-గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూకబ్జాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్



కుత్బుల్లాపూర్, జూలై 29 (విజన్ ఆంధ్ర): హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును రాజకీయ కోణంలో ప్రచారం చేయడం సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైడ్రా ఏర్పాటైన నాటి నుంచి చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిర్ణయాలు తీసుకున్నప్పటికీ, హైడ్రా చర్యల వల్ల అత్యధికంగా నష్టపోయింది అక్రమ కబ్జాదారులేనని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో పలు ప్రాంతాల్లో చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని, వాటిపై హైడ్రా చర్యలు ప్రారంభించడంతో కబ్జాదారులు కోర్టులను ఆశ్రయిస్తూ తమ ఆక్రమణలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పేద ప్రజలు హైడ్రాకు వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించిన ఘటనలు చాలా తక్కువగా ఉన్నాయని తెలిపారు. హైడ్రాపై తమ పార్టీకి కొన్ని భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ఆ సంస్థ చేపడుతున్న చర్యలకు సీపీఐ మద్దతు ఇస్తుందని ఉమామహేష్ స్పష్టం చేశారు. అయితే పరికి చెరువులో జరిగిన అక్రమ నిర్మాణాలపై సమర్థవంతమైన చర్యలు తీసుకోవడంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ విఫలమయ్యారని విమర్శించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజకీయ పక్షపాతం లేకుండా ప్రభుత్వం నిష్పాక్షపాతంగా వ్యవహరించాలని ఆయన కోరారు. గత ప్రభుత్వ హయాంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకునేందుకు కఠిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు రానున్న రెండు రోజులు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లి జిల్లా జులై 29 (విజన్ ఆంధ్ర ) భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఇంటి నుండి బయటకు రావొద్దని, అత్యవసర అవసరాల కోసం వస్తే తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని, ఉధృతంగా ప్రవహించే వాగులు, వంకలు, చెరువులు, కల్వర్టుల వద్దకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లకూడదని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు కలెక్టరేట్‌లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

హెల్ప్‌లైన్ నంబర్ 9030632608

అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఈ నంబర్‌కు సంప్రదించి ప్రభుత్వ సహాయాన్ని పొందవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

వర్షాలకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు అత్యవసర సేవలకు అవసరమైన సహాయం అందించాలని ఆయన సూచించారు.

ప్రజల భద్రత ముఖ్యమని, అందరూ జాగ్రత్తలు పాటిస్తూ అధికారులకు సహకరించాలని ప్రజలకు జిల్లా కలెక్టర్ సూచించారు.

### హత్నూర్ మండలం కాసాల రైతు వేదికలో

# న్యాయ అవగాహన కార్యక్రమం

విజన్ ఆంధ్ర హత్నూర : జాతీయ న్యాయ సేవధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ హైదరాబాద్ వారి ఆదేశాల ప్రకారం జిల్లా అధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గారి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి సౌజన్య గారు హత్నూర్ మండలం కాశాల రైతు వేదికలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య గారు ముఖ్య అతిథిగా పాల్గొని రైతులు, మహిళలు, గ్రామస్థులకు న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆమె నాల్సా జాగృతి (జీూ+=×ు×) పథకం గురించి వివరిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు తమ న్యాయ హక్కులను తెలుసుకొని అవసరమైనప్పుడు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహాలు, మధ్యవర్తిత్వ సేవలు మరియు ఇతర న్యాయ సేవలను పొందవచ్చని తెలిపారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందించుకోవాలని, మహిళలు, చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులు మరియు ఇతర అర్హులైన వర్గాలు తమకు చట్టపరంగా కల్పించిన హక్కులను వినియోగించుకోవాలని సూచించారు.

అలాగే రైతు వేదికలలో నిర్వహిస్తున్న విత్తన మేళా ప్రాముఖ్యతను వివరించి, ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలను వినియోగించడం, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించడం, ఆధునిక సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు. వివాదాలు తలెత్తినప్పుడు కోర్టులను ఆశ్రయించడంతో పాటు, సాధ్యమైనంత వరకు మధ్యవర్తిత్వం, లోక్ అదాలత్ వంటి ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలను వినియోగించుకోవాలని కోరారు. ప్రజలు న్యాయ సేవల కోసం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి సౌజన్య గారు, మండల రెవెన్యూ అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు, గ్రామస్థులు మరియు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వరి సాగులో వేరు ముంచే పద్ధతిపై రైతులకు ప్రత్యక్ష అవగాహన

చౌటకూర్, జూలై 29 (విజన్ ఆంధ్ర):– సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల కేంద్రంలో బుధవారం వరి సాగులో అనుసరించాల్సిన వేరు ముంచే పద్ధతిపై రైతులకు ప్రత్యక్ష అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు భూపాల్ పొలంలో వరి నారు మొక్కల వేర్లను జీవ ఎరువులు, జీవ నియంత్రణ కారకాలు, పోషకాలు కలిపిన ద్రవ మిశ్రమంలో 15 నుంచి 30 నిమిషాల పాటు నానబెట్టి నాటే విధానాన్ని ప్రదర్శించారు. ఈ పద్ధతిని అనుసరించడం వల్ల వరి నారు మొక్కలు ప్రారంభ దశలోనే బలంగా ఎదగడంతో పాటు, వేర్ల పెరుగుదల మెరుగుపడి తెగుళ్లు, వ్యాధుల బారిన పడే అవకాశం తగ్గుతుందని వివరించారు. దీంతో పంట ఆరోగ్యంగా పెరిగి దిగుబడి పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థినులు ఎస్తేర్, శ్రీనిధి, రితిక, ధృతి, దివ్య పాల్గొని రైతులకు వేరు ముంచే పద్ధతి ప్రాముఖ్యత, జీవ ఉద్దీపన ద్రావణం వినియోగం, వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రైతులు ఆసక్తిగా పాల్గొని పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

### కేటీపీపీలో టీజీపీఈజేఏసీ ఆధ్వర్యంలో

## 32వ రోజు నిరసన కొనసాగింపు

యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్ ) ఏహెచ్‌పీ ఓ సీఎచ్‌పీ ప్రైవేటీకరణ టెండర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ టీజీపీఈజేఏసీ ఆధ్వర్యంలో కేటీపీపీ ప్రధాన గేటు వద్ద 32వ రోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. వైటీపీఎస్ ఏహెచ్‌పీ ఓ సీఎచ్‌పీ నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే నిర్ణయం ఉద్యోగుల భవిష్యత్తుకు, ప్రభుత్వ రంగ సంస్థల మనుగడకు హానికరమని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. టీజీపీఈజేఏసీ నాయకులు మాట్లాడుతూ, టెండర్‌ను వెంటనే రద్దు చేసి ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని మరియు టీజెన్‌కో యాజమాన్యాన్ని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో టీజీపీఈజేఏసీకి చెందిన వివిధ ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్ల నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమానికి సంఘీభావం తెలిపారు.

# జేఎన్టీయూహెచ్ సుల్తాన్పూర్‌లో రోబోటిక్స్‌పై ప్రాక్టికల్ వర్క్‌షాప్

**– విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యక్ష శిక్షణ**

చౌటకూర్ జూలై 29 (విజన్ ఆంధ్ర): చౌటకూర్ మండలంలోని సుల్తాన్పూర్ జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సుల్తాన్పూర్‌లో శిక్షణ మరియు ఉపాధి కల్పన విభాగం, ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసీ) సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం "రోబోటిక్స్ ఇన్ అకాడెమిక్స్" అంశంపై ఒకరోజు ప్రాక్టికల్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు రోబోటిక్స్‌కు సంబంధించిన ఆధునిక సాంకేతిక అంశాలపై నిపుణులు ప్రత్యక్ష శిక్షణ అందించారు. సోహమ్ అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్‌కు చెందిన రోబోటిక్స్ శిక్షకులు రోబోటిక్స్ మౌలిక సూత్రాలు, సెన్సర్లు, యాక్చ్యుయేటర్లు, కంట్రోలర్లు, రోబోటిక్ వ్యవస్థల రూపకల్పన, ప్రోగ్రామింగ్ విధానాలు, అలాగే పరిశ్రమల్లో రోబోటిక్స్ వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శనలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఈ వర్క్‌షాప్‌లో బి.టెక్ ద్వితీయ సంవత్సరం ఈసీఈ, ఈఈఈ, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రోబోట్ల నిర్మాణం, నిర్వహణ, ప్రోగ్రామింగ్ వంటి అంశాల్లో ప్రత్యక్ష అనుభవం పొందిన విద్యార్థులు ఆధునిక రోబోటిక్స్ సాంకేతికతపై విలువైన అవగాహన పెంపొందించుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. విశ్వనాథ రాజు మాట్లాడుతూ, విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకుని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. శిక్షణ మరియు ఉపాధి కల్పన అధికారి డా. ఎం. శైలజ మాట్లాడుతూ, ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు విద్యార్థుల సాంకేతిక సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. సోహమ్ అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ప్రతినిధులు మాట్లాడుతూ, వర్క్‌షాప్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే రోబోటిక్స్ అవగాహన, శిక్షణ కార్యక్రమాల్లో వాలంటీర్లుగా పాల్గొనే అవకాశం కల్పిస్తామని తెలిపారు. దీనివల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతతో పాటు సాంకేతిక నైపుణ్యాలు మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.

# వంగూరు పోలీస్ స్టేషన్ తరలింపు వద్దు

**- పార్టీలకు అతీతంగా ప్రజల నిరసన..**

**- బైక్ ర్యాలీ,ఎమ్మార్వో కి వినతిపత్రం..**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, జూలై 29, (విజన్ ఆంధ్ర)

నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండల కేంద్రంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న పోలీస్ స్టేషన్‌ను శ్రీశైలం రహదారిపైకి తరలించే ప్రయత్నాన్ని వంగూరు ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. స్టేషన్‌ను తరలించేందుకు స్థల పరిశీలన జరిగిందన్న సమాచారంతో రగిలిపోయిన గ్రామ ప్రజలు బుధవారం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామ పెద్దలు, యువకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు అందరూ కలిసి నిరసన తెలిపారు.

"ప్రజల మధ్య స్టేషన్ ఉండాలి"

ఈ సందర్భంగా మాజీ సర్పంచ్, బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు వేనేపల్లి గణేష్ రావు మాట్లాడుతూ,ఎన్నో ఏళ్లుగా ప్రజల మధ్యలో ఉన్న పోలీస్ స్టేషన్‌ను ప్రజలకు రక్షణ లేకుండా ఎక్కడో రహదారిపైకి ఎందుకు తరలిస్తారు? ప్రజలకు అందుబాటులో, అత్యవసర సమయంలో సహాయం అందించేలా ఉండాల్సిన స్టేషన్‌ను మారుమూలకు తరలించడం సరికాదు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలి" అని డిమాండ్ చేశారు.



బైక్ ర్యాలీ – వినతిపత్రాలు

నిరసనలో భాగంగా గ్రామపంచాయతీ నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మార్వో మురళిమోహన్, గ్రామపంచాయతీ సర్పంచ్ పురుగుల యాదయ్య కు వినతిపత్రాలు అందజేశారు. పోలీస్ స్టేషన్‌ను యథాస్థానంలోనే కొనసాగించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వోక్షిత్ హిల్ వ్యూ కాలనీ అభివృద్ధికి మరిన్ని చర్యలు

-మౌలిక వసతుల మెరుగుదలకు కృషి చేస్తాం: ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

-గాజులరామారం డివిజన్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర

-చింతలచెరువు సుందరీకరణకు ప్రత్యేక ప్రణాళిక

-చెరువులోకి మురుగునీరు చేరకుండా అధికారులకు ఆదేశాలు

-అంతర్గత రహదారుల నిర్మాణానికి కాలనీవాసుల వినతి

-ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

కుత్బుల్లాపూర్, జూలై 29 (విజన్ ఆంధ్ర): గాజులరామారం డివిజన్ పరిధిలోని వోక్షిత్ హిల్ వ్యూ కాలనీలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ బుధవారం పాదయాత్ర నిర్వహించారు. కాలనీలో ప్రజలకు అందుతున్న మౌలిక సదుపాయాలను పరిశీలించిన ఆయన స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమీపంలోని చింతలచెరువును సందర్శించిన ఎమ్మెల్యే, చెరువు సుందరీకరణకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.



సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేలా అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసి, కాలనీలో మిగిలిన అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. ఇప్పటికే ఎమ్మెల్యే చొరవతో ప్రధాన రహదారి సీసీ రోడ్డు, తాగునీటి పైప్‌లైన్, భూగర్భ డ్రైనేజీ వంటి సమస్యలు పరిష్కారమవడంతో ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ, వోక్షిత్ హిల్ వ్యూ కాలనీ అభివృద్ధి కోసం ఇప్పటికే కోట్లాది రూపాయలతో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్, సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మిగిలిన అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు భూగర్భ డ్రైనేజీ అవుట్‌లెట్ సమస్యను కూడా పరిష్కరించి కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాలనీ చుట్టూ ఉన్న సహజసిద్ధమైన ఆహ్లాదకర వాతావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గాజులరామారం సర్కిల్ డీసీ వెంకటరాములు, ఆర్ఐ ఖలీల్, ఈఈ గోవర్ధన్ గౌడ్, ఏఈ కళ్యాణ్, వాటర్‌వర్క్స్ జీఎం రవి నాయక్, వోక్షిత్ హిల్ వ్యూ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ గౌడ్, వ్యవస్థాపకుడు సోమిరెడ్డి, కమిటీ సభ్యులు సురేందర్ బాబు, చంద్రశేఖర్ రెడ్డి, కాలనీవాసులు, మహిళలు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ నుంచి షామీర్పేట్ వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్:

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా 29 (విజన్ ఆంధ్ర ప్రతినిధి) సికింద్రాబాదు నుండి శామీర్ పేట్ వరకు శరవేగంగా నిర్మిస్తున్న ప్రతిష్టాత్మకమైన ఎలివేటెడ్ కారిడార్ పనులు జిల్లాలో అత్యంత వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని 5 గ్రామానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే పోతాయిపల్లితో పాటు లోతుకుంట, తూంకుంట గ్రామాల భూసేకరణ ప్రక్రియ విజయవంతంగా పూర్తి కాగా, చివరిదైన అల్వాల్ గ్రామానికి సంబంధించి జిల్లా స్థాయి భూసేకరణ కమిటీ డి ఎల్ ఎన్ సి, సమావేశంలో పరిహార ధరను గజానికి రూ.1,10,000 గా నిర్ణయించడం జరిగింది. ఈ నిర్ణయం పట్ల భూ యజమానులు,సంపూర్ణ సంతృప్తిని, హర్షాన్ని వ్యక్తం చేశారు.

మిగిలిన ఈ చివరి గ్రామం అల్వాల్ భూసేకరణ ప్రక్రియ కూడా తుది దశకు చేరడంతో, వచ్చే నెల లేదా నెలన్నర రోజులలో భూ యజమానులందరికీ పరిహారం మొత్తాన్ని చెల్లించేందుకు అధికారులు చర్యలు వేగవంతం చేశారు.

## రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు బ్రైట్ స్టార్ మారుతి తైక్వాండో అకాడమీ విద్యార్థులు ఎంపిక

అయిజ జులై 29 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్స్‌లో ఈ నెల 26వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీలలో బ్రైట్ స్టార్ మారుతి తైక్వాండో అకాడమీకి చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. సబ్ జూనియర్, క్యాడెట్, జూనియర్ విభాగాల్లో అయిజకు చెందిన నంద కిషోర్, అఫాన్, తలారి, గొర్ల మిన్ను, అజిత్, ధర్మతేజ, వీరేంద్ర, తేజసాయి తమ ప్రతిభతో మెడల్స్ గెలుచుకుని, ఆగస్టు 8, 9, 10 తేదీలలో కరీంనగర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను బ్రైట్ స్టార్ స్కూల్ హెడ్‌మాస్టర్ మేడం అభినందించారు. అలాగే జోగులాంబ గద్వాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు మాస్టర్ షేక్షావలి ఆచారి శుభాకాంక్షలు తెలియజేసి, రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభ కనబర్చి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోచ్ నవదీప్ సాగర్ పాల్గొన్నారు.

## పేర్ని నాని, జోగి రమేష్ ల బండారం ప్రజలందరికీ తెలిసిందే...

**- కూటమి ప్రభుత్వం గురించి మాట్లాడే అర్హత వారికి లేదు...**

**రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం ధ్వజం**



తిరుపతి, జులై 29 :వైసిపి మాజీ మంత్రులు పేర్ని నాని, జోగి రమేష్ ల అవినీతి, అక్రమాల బండారం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని వారి కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు సైతం చీదరించుకున్న తీరు వారిద్దరిదని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం విమర్శించారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లను విమర్శించే అర్హత వారికి లేదన్నారు. పేదలకు అందాల్సిన ఉచిత రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించి అవినీతికి కేరాఫ్ అడ్రస్ గా పేర్ని నాని నిలిచారన్నారు.గత ఐదేళ్లు మంత్రిగా ఉండి మచిలీపట్నానికి ఒక్క మంచి పని కూడా చేయని నాని అధినేత జగన్ రెడ్డి మెప్పు కోసం, మీడియాలో ప్రచారం కోసం ప్రగల్భాలు పలుకుతున్నారని మండిపడ్డారు. పేర్ని నాని ముందుగా తన అవినీతి సామ్రాజ్యంపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇసుక ర్యాంపులను అనుచరులకు ఇచ్చి ఇతర రాష్ట్రాలకు లారీ ఇసుకను 50 వేల నుంచి 70 వేల రూపాయల వరకు వసూలు చేస్తూ వందల కోట్లు దండుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. ముంగినపూడి గినపూడి సముద్ర తీర ప్రాంతాల్లో మట్టిని అక్రమంగా దోచేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. చారిత్రాత్మక మెగా డిఎస్సీ ప్రకటన, పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయుల బదిలీ లలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పారదర్శకత తీసుకు వచ్చారని, గత ఐదేళ్లలో విద్యాశాఖను సంక్షోభం లోకి నెట్టిన గొడ్డలి పార్టీకి ఈ విజయాలను చూసి అసూయతో కడుపు మండుతోందని పేర్కొన్నారు. టీచర్ల గురించి మాట్లాడే అర్హత పేర్ని నానీకి లేదన్నారు .

ఇక వైసిపి పార్టీ సీనియర్ నాయకుడైన జోగి రమేష్ కోడలికి జరిగిన అన్యాయంపై జగన్మోహన్ రెడ్డి ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. నిత్యం మీడియా ముందు మాట్లాడే మాజీ మంత్రి రోజా, వైసీపీ నాయకురాలు శ్యామల ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. బయటకు వచ్చి బీసీ రక్షణ చట్టాలు గురించి మాట్లాడే జోగి రమేష్ కు తన ఇంట్లో మహిళలను రక్షించుకునే సంస్కృతి లేదని,గత వైసిపి ఐదేళ్ల అరాచక పాలన చూసి ప్రజలు వైసిపిని 11 సీట్ల కే పరిమితం చేశారని గుర్తు చేశారు . ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు సుధాకర్, సత్తు మధుసూదన్ యాదవ్, బాలరాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## వర్ష ప్రభావిత ప్రాంతాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ తనిఖీ

బెల్లంపల్లి, జూలై 29 విజన్ ఆంధ్ర : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి, , కమిషనర్ తన్నీరు రమేష్ పట్టణంలోని బజార్ ప్రాంతం, పలు బస్తీల్లో బుధవారం పర్యటించారు. వర్షాల కారణంగా ఇళ్లు కూలిన బాధితులను పరామర్శించి, నీరు నిలిచిన ప్రాంతాలు, డ్రైనేజీలు, నేలకూలిన భారీ వృక్షాలను పరిశీలించారు.

ప్రధాన రహదారులపై నిలిచిన వర్షపు నీటిని వెంటనే తొలగించేలా నాళాలను శుభ్రం చేయించారు. బస్తీల్లో కూలిన చెట్లను తొలగించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. నీరు నిలిచే ప్రాంతాల్లో డ్రైనేజీల పూడికతీత, వరద నీటి మళ్లింపు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని మున్సిపల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు మున్సిపల్ అధికారులను వెంటనే సంప్రదించాలని, ప్రజలకు అన్ని విధాలుగా అందుబాటులో ఉంటామని చైర్‌పర్సన్ తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పర్యటనలో మున్సిపల్ వైస్‌చైర్మన్ రాగంశెట్టి సత్యనారాయణ, నాయకులు దావ రమేష్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పులుల సంరక్షణ పట్ల అందరూ బాధ్యతయుతంగా వ్యవహరించాలి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జూలై 29 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): పులుల సంరక్షణ పట్ల సమాజంలోని అన్ని వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఈ భూమి కేవలం మనుషుల ఆవాసం మాత్రమే కాదని, సమస్త జీవరాశుల ఉమ్మడి నివాసం అని గుర్తించి ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. ఈ రోజు అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా దూలపల్లిలోని తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను మంత్రి పరిశీలించారు. పులుల సంరక్షణకు సంబంధించిన లఘు చిత్రాన్ని మంత్రి వీక్షించారు.

ఈ కార్యక్రమంలో అటవీదళాల ప్రధాన సంరక్షణాధికారి వినయ్ కుమార్, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ దండా రాజిరెడ్డి, పిసిసిఎఫ్ (డెవలప్ మెంట్) రత్నాకర్ జౌహరి, సిసిఎఫ్ టిజిఎస్ఎఫ్ఎ డైరక్టర్ ప్రియాంక వర్గీస్, సిసిఎఫ్ ఎన్ క్షితిజ, టైగర్ సెల్ రీసర్చ్ సైంటిస్ట్ అయాన్ సాధు, అమ్రాబాద్ ఫీల్డ్ డైరెక్టర్ ప్రసాద్, కవాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం పలువురు అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్ర కొండా సురేఖ, సభను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి సంవత్సరం జూలై 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. పులుల సంరక్షణ ప్రాధాన్యతపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంపొందించేందుకు 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్ లో ప్రారంభమైన ఈ కార్యక్రమం నేడు ప్రకృతి పరిరక్షణకు ఒక గొప్ప వేదికగా నిలిచిందన్నారు. పులి అటవీ సంపదకు ప్రతీక అని, పులిని



పరిరక్షించడమంటే అడవిని, పర్యావరణాన్ని, జీవవైవిధ్యాన్ని, భావితరాల భవిష్యత్తును పరిరక్షించడమేనని అన్నారు.

వేట, అడవుల నరికివేత, అక్రమ రవాణా వంటి కారణాలతో వాటి సంఖ్య తీవ్రంగా తగ్గిపోయిందని మంత్రి సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చేందుకు నాటి ప్రధాని ఇందిరా గాంధి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1972లో వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని, 1973లో "ప్రాజెక్ట్ టైగర్" ను ప్రారంభించి దేశవ్యాప్తంగా పులుల సంరక్షణకు బలమైన చర్యలు చేపట్టిందని వివరించారు.ఈ చర్యల ఫలితంగానే నేడు భారతదేశం ప్రపంచ పులుల సంరక్షణలో అగ్రగామిగా నిలిచిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలోని మొత్తం పులుల్లో సుమారు 75 శాతం పులులు భారతదేశంలోనే ఉన్నాయని, దేశంలో ప్రస్తుతం 58 టైగర్ రిజర్వులు విజయవంతంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రానికి కూడా ఈ విషయంలో విశిష్టమైన స్థానం ఉందని మంత్రి అన్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులు దేశంలోనే ప్రాముఖ్యత కలిగిన పులుల అభయారణ్యాలుగా గుర్తింపు పొందాయని మంత్రి తెలిపారు.

అమ్రాబాద్ టైగర్ రిజర్వులో నీటి వనరుల అభివృద్ధి, వాటి ఆవాసాల మెరుగుదల, ఆధునిక రక్షణ చర్యల వల్ల పులుల సంఖ్య గణనీయంగా పెరిగిందని మంత్రి స్పష్టం చేశారు.

కవ్వాల్ టైగర్ రిజర్వు లో పులుల సంఖ్యను వృద్ధి చేసేందుకు టైగర్ రీఇంట్రడక్షన్ ను చేపట్టినట్లు మంత్రి సురేఖ తెలిపారు. ఇందులో భాగంగా కవ్వాల్ టైగర్ రిజర్వ్ ను మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వుతో అనుసంధానించి పులుల సహజ సంచారానికి అనుకూల పరిస్థితులు కల్పించినట్లు వివరించారు. దీంతోపాటు ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం వంటి కార్యక్రమాలను అటవీ శాఖ అమలు చేస్తున్నదని మంత్రి తెలిపారు.

అడవులను కాపాడుకుందామని, వన్యప్రాణులను సంరక్షిద్దామని, భావితరాలకు పచ్చని తెలంగాణను అందిద్దామని ఈ సందర్భంగా మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా పులుల సంరక్షణకు అటవీ శాఖతో పాటు, ప్రతి పౌరుడు బాధ్యత తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ గారు పిలుపునిచ్చారు.

ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులను ఉద్దేశించి "అటవీ సంపదను పరిరక్షించడంలో నిబద్ధత, నిజాయితీ, సేవాభావంతో పనిచేసి భావి తరాలకు పచ్చని తెలంగాణను అందించాలి" అని మంత్రి దిశా నిర్దేశం చేశారు.

అటవీ సంపద, వన్య ప్రాణుల సంరక్షణలో విశేష కృషి చేసిన పలువురు అటవీ శాఖ ఉద్యోగులకు ప్రశాంస పత్రం తో పాటు, నగదు బహుమతిని మంత్రి సురేఖ అందించారు. అదే విధంగా అంతర్జాతీయ పులుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రాలేఖన పోటీలో గెలిచిన విద్యార్థులకు మంత్రి సురేఖ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు.